
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఖమ్మం

5

మంగళవారం, 4 ఫిబ్రవరి 2025

గోదాముల్లో నిండుకున్న బియ్యం

- రేషన్ దుకాణాలకు సరఫరా కాని వైనం
- సన్నాల కొనుగోలుతో ఖమ్మం జిల్లాలో బియ్యం కొరత

7

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి

- స్థానిక ఎన్నికలపై వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి

అప్రజాస్వామికంగా కేంద్ర బడ్జెట్

- బీజేపీయేతర పాలిత రాష్ట్రాలపై ఆర్థిక వివక్ష
- 'విభజన' హామీల అమలులో తెలంగాణకు అన్యాయం
- 'సీతారామ'కు జాతీయ హోదా ఇవ్వకపోవడం శోచనీయం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- కేంద్ర బడ్జెట్ తీరుపై నల్లజెండాలతో నిరసన

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఫెడరల్ స్ఫూర్తితో ఇటీవలే గణతంత్ర దినోత్సవాలు జరుపుకొన్న దేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అప్రజాస్వామికంగా ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు విమర్శించారు. బీజేపీయేతర పాలిత రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయింపులో వివక్ష చూపడంపై టీపీసీసీ పిలుపు మేరకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం నగరంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సంజీవరెడ్డి భవన్ నుంచి జడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు నల్లజెండాలతో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అంబేద్కర్ విగ్రహం వద్ద కూర్చొని నిరసన తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. విభజన చట్టం మేరకు తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన కేటాయింపులను కేంద్రం పరిగణించలేదన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమపై నోరు మెదపలేదని, రైల్వేకోచ్ ఫ్యాక్టరీకి కూడా (మిగతా 6వ పేజీలో)



ఖమ్మంలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం



ఖమ్మం జడ్పీ సెంటర్‌లో బైఠాయించిన మంత్రి తుమ్మల, కాంగ్రెస్ నాయకులు



మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలు

ఎర్రబంగారం వెలవెల

- మిర్చి దిగుబడి పెరిగినా మార్కెట్‌లో ధర కరువు
- ఎగుమతులు లేకపోవడమే కారణమంటున్న వ్యాపారులు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- ఖమ్మం మార్కెట్‌కు పోటెత్తుతున్న తేజమిర్చి
- నష్టాలనే మిగిల్చిన ఏసీ మిర్చి

ఖమ్మం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మార్కెట్‌లో ఎర్ర బంగారం వెలవెలబోతోంది. అస్థిరమైన ధరలతో మిర్చి సాగు రైతులకు జూదంలా మారింది. ఒక సంవత్సరం భారీ ధరతో మురిపిస్తుండగా మరో ఏడాది ధర లేక నష్టాలు పోగేస్తోంది. 'కలిసొస్తే లాభం.. లేకుంటే నష్టం' అన్నట్లు తయారైంది మిర్చి రైతు పరిస్థితి.. ఈ సంవత్సరం ఉమ్మడి జిల్లాలో మిర్చి దిగుబడి ఆశించిన స్థాయిలోనే ఉన్నా.. మార్కెట్‌లో ధర మాత్రం రైతులను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది.

దిగుబడి పెరిగినా.. రాబడి లేదు..

రాష్ట్రంలో అత్యధికంగా మిర్చిసాగు చేస్తున్న జిల్లాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఒకటి. జిల్లాలో ప్రతిఏటా లక్షనుంచి లక్షన్నర ఎకరాలు మిర్చి సాగవుతుండగా గడిచిన రెండేళ్లుగా వరుసగా మిర్చిపంటకు తామర పురుగు తెగులుతో దెబ్బతిన్న మిర్చి రైతు ఈ ఏడాది సాగు తగ్గించారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో లక్ష ఎకరాలే మిర్చి సాగయింది. 50వేల ఎకరాల సాగు తగ్గింది. అయితే ఈ ఏడాది దిగుబడులు ఆశించిన స్థాయిలో ఉన్నాయి. ప్రస్తుతం 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. గత ఏడాది తామర తెగులుతో 5నుంచి 10క్వింటాళ్ల దిగుబడే గగనమైంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది (మిగతా 6వ పేజీలో)

రైతు కంట్లో కారం

- వ్యాపారులు సిండికేట్‌గా మారి దోపిడీ చేస్తున్నారు
- గిట్టుబాటు ధర రాకపోతే మరింత ఉద్యమిస్తాం
- రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు
- మార్కెట్‌లో జెండా పాట అడ్డుకుని ధర్నా



ఖమ్మం మార్కెట్‌లో సీపీఐ ఆందోళన

ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి అప్పులు చేసి పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పించకుండా రైతుల కంట్లో కారం కొడుతున్నారని సీపీఐ విభాగం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు ఆరోపించారు. సోమవారం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన ఆయన మాట్లాడుతూ వ్యాపారులు సిండికేట్‌గా మారి మిర్చి రైతులకు మంచి ధరలు రాకుండా నియంత్రిస్తున్నారన్నారు. ఈ ఏడాది మిర్చి సాగుకు పెట్టుబడి ఖర్చులు గణనీయంగా పెరిగాయని, అదేవిధంగా దిగుబడులు తగ్గాయని, మార్కెట్లో పంట అమ్ముదామంటే ధరలు పడి పోయాయని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు.

ఈ సందర్భంగా జెండా పాటను అడ్డుకుని మార్కెట్‌లో కొద్ది సేపు ఆందోళన నిర్వహించారు. జెండాపాటే ఒక మోసం అని వ్యాపారులు, ఉద్యోగులు కలిసి రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. దీంతో మార్కెట్‌లో సుమారు గంటపాటు కొనుగోళ్ల నిలిచిపోయాయి. మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్ స్పందించి ఆందోళన చేస్తున్న సీపీఐ శ్రేణులను సముదాయించి మళ్లీ రెండోసారి జెండాపాట నిర్వహించి కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, నాయకులు మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, జానీమియా, దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, పోటు కళావతి, మిడికంటి వెంకటరెడ్డి, తాటి వెంకటేశ్వర్లు ఉన్నారు.

వెల్లువెత్తిన ఎర్రబంగారం

ఖమ్మం మార్కెట్‌కు 60 వేల మిర్చి బస్తాల రాక

6



విప్పలమడకలోని దళితవాడలో ఉన్న మట్టి రోడ్డు

ఎట్టకేలకు ఎస్సీ సబ్‌ప్లాన్

ఉమ్మడి జిల్లాకు రూ.118.48 కోట్లు మంజూరు

వైరా, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న దళితవాడల్లో సీసీ రోడ్లు ఇతర నిర్మాణాల కోసం రూ.118,48,47,000నిధులు మంజూరయ్యాయి. ఆ మేరకు ప్రభుత్వ కార్యదర్శి డీఎస్. లోకేష్‌కుమార్ జీవోఆర్‌టీ నెంబర్ 78 ద్వారా ఉత్తర్వులిచ్చారు. ఖమ్మంజిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న దళిత వాడల్లో 767 అభివృద్ధి పనుల కోసం రూ.63,26,17,000వేలు, భద్రాద్రి జిల్లాలోని దళితవాడల్లో 1122 అభివృద్ధి పనుల కోసం రూ.55,22,30,000 మంజూరయ్యాయి. నియోజకవర్గాల వారీగా నిధుల వివరాలిలా...

ఖమ్మం జిల్లాలో...

ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో 17పనులకు రూ.17కోట్లు, పాలేరు నియోజకవర్గంలో 34పనులకు రూ.10కోట్ల పైచిలుకు, సత్తుపల్లి నియోజకవర్గంలో 260పనులకు రూ.13.31కోట్లు, వైరా నియోజకవర్గంలో 212పనులకు రూ.9కోట్ల, 94లక్షల, 17వేలు, మధిర నియోజకవర్గంలో 244పనులకు రూ.20కోట్లు మంజూరయ్యాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో...

భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గంలో 179పనుల కోసం రూ.10కోట్ల, 80వేలు, అశ్వారావుపేట నియోజకవర్గంలో 218పనులకు రూ.పదికోట్లు, ఇల్లెందు నియోజకవర్గంలో 218పనులకు రూ.పదికోట్లు, కొత్తగూడెం నియోజకవర్గంలో 252పనులకు రూ.15కోట్లు, పినపాక నియోజకవర్గంలో 255పనులకు రూ.10కోట్ల, 21లక్షల, 50వేలు మంజూరయ్యాయి.



సమీక్షిస్తున్న డీఆర్వో పద్మజ

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- మార్చి 5 నుంచి 25 వరకు నిర్వహణ
- 72 పరీక్ష కేంద్రాలు... 36 వేల మంది విద్యార్థులు
- అధికారులతో సమీక్షించిన డీఆర్వో పద్మజ

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో తన ఛాంబర్‌లో ఇంటర్ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 5 నుంచి మార్చి 25వరకు జరిగే ఇంటర్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే 36,660మంది విద్యార్థుల కోసం 72పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేసి పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ బి.కళావతిబాయి, పోస్టల్‌శాఖ అధికారి నారాయణ, ఆర్టీసీ అధికారి దినేష్ కుమార్, సాంఘీక సంక్షేమ శాఖ ఆర్సీవో విజయలక్ష్మి, మైనారిటీ శాఖ ఆర్సీవో వెంకట రామయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఊరిస్తున్న 'విమాన' కల



- 'గూడెం' ఎయిర్‌పోర్టుకు సానుకూలంగా ప్రాథమిక సర్వే రిపోర్టు?
- ప్రతిపాదిత స్థలంలో కొంత అనుకూలంగా లేదని సర్వే బృందం గుర్తింపు
- ప్రత్యామ్నాయ స్థలం చూపిస్తే ఓకే
- 'సాంకేతిక' సర్వే కోసం మరోసారి ఢిల్లీకి మంత్రి తుమ్మల
- అన్ని అనుకూలిస్తే కొత్త 'ఉడాన్' పథకంలో 'గూడెం' ఎయిర్‌పోర్టుకు స్థానం

కొత్తగూడెం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో నూతన విమానాశ్రయాల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త ఉడాన్ (ఉడే దేశ్ క ఆమ్ నాగ్రిక్) పథకంలో కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు స్థానం దక్కుతుందా.. లేదా.. అన్న అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కేంద్రం 2016లో ప్రారంభించిన 'ఉడాన్' పథకం ఆశించిన ఫలితాలు సాధించలేదనే విమర్శలు వచ్చిన నేపథ్యంలో ఇటీవల ప్రకటించిన కేంద్ర బడ్జెట్‌లో కొత్త ఉడాన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం ద్వారా వచ్చే పదేళ్లలో 4కోట్ల మందికి కొత్తగా విమాన ప్రయాణ సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా దేశంలో మరో 120 నూతన విమాన మార్గాలను అందుబాటులోకి తీసుకురానున్నట్టు ప్రకటించారు. నూతన ఉడాన్ పథకానికి కేంద్రం రూ.540కోట్లు కేటాయించింది.

ప్రాథమిక సర్వే నివేదికే కీలకం

కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు ప్రాథమిక సర్వే పూర్తయిన నేపథ్యంలో ఆ కమిటీ కేంద్రానికి ఎలాంటి నివేదిక ఇస్తుందనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఏవియేషన్ బృందం తమ ప్రాథమిక నివేదికను సానుకూలంగా ఇస్తే మరో పదిరోజుల్లో సాంకేతిక బృందం మరోమారు క్షేత్రస్థాయి సర్వేకు రానుంది. అదే జరిగితే కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు 'ఉడాన్' పథకంలో స్థానం దక్కే అవకాశం ఉంది.

కొత్తగూడెం ప్రాంతంలోని రామవరం-గరీబ్‌పేట, సుజాతనగర్ మండలంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని ఇప్పటికే కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలుసార్లు విజ్ఞప్తి చేశారు. దాంతో ఏవియేషన్ బృందం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించింది. ఈ బృందం నివేదిక ఆధారంగా మరో పది రోజుల్లో సాంకేతిక నిపుణుల బృందం కొత్తగూడెం ఎయిర్‌పోర్టు స్థలాన్ని పరిశీలించేందుకు వస్తుంది. ఈ నేపథ్యంలో త్వరలోనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడిని మరోమారు కలిసి కొత్తగూడెం ప్రాంతంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అనుకూలంగా ఉందని, సాంకేతిక నిపుణుల బృందాన్ని సర్వేకు పంపాలని కోరనున్నట్లు సమాచారం.

తొలి సర్వే సంతృప్తికరమే కానీ..

కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు కేటాయించిన 950 ఎకరాల భూమిని ఆరుగురు (మిగతా 6వ పేజీలో)

మరో 1500 కోళ్లు మృతి

- పెద్దకోరుకొండి గ్రామంలో వైరస్ కాటు

కల్లూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వైరస్ కాటుకు బాయిలర్ కోళ్లు మృత్యువాత పడుతూనే వున్నాయి. కల్లూరు మండల పరిధిలోని పెద్దకోరుకొండి గ్రామంలోని ఓ కోళ్లఫామ్‌లో సోమవారం వైరస్‌కు 1500 కోళ్లు మృతిచెందాయి. పెద్దకోరుకొండి గ్రామంలో పసుపులేటి వెంకటేశ్వర్లుకు చెందిన కోళ్లఫామ్‌లో 5 వేలకు పైగా కోళ్లను (చిన్న బాయిలర్) పెంచుతున్నాడు. 30 రోజుల వరకు ఎదిగిన బాయిలర్ కోళ్లకు వైరస్ సోకగా ఆదివారం 500 కోళ్లు మృతి చెందాయి. రెండవ రోజైన సోమవారం మరో 1000 కోళ్లు మృతిచెందాయి. దీంతో తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని ఫామ్ యాజమాని వెంకటేకశ్వర్లు విలేకరులకు తెలిపాడు. ప్రైవైట్ కంపెనీతో సదరు కోళ్ల ఫామ్ అనుసంధానంగా ఏర్పాటు చేయటంతో తమకు ఫామ్ యాజమాని సమాచారం అందించలేదని స్థానిక పశువైద్యాధికారి మమత తెలిపారు. మృతి చెందిన కోళ్లను గ్రామానికి దూరంగా తరలించి గొయ్యి తీసి పాతిపెట్టినట్టు తెలిసింది.

తునికాకు ప్రూనింగ్ సకాలంలో చేపట్టాలి

ఎన్‌డీ రాష్ట్ర కార్యదర్శి అశోక్

ఇల్లెందు టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తునికాకు సేకరణ కోసం తక్షణమే టెండర్లు వేసి ప్రూనింగ్ పనులు చేపట్టాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం ఇల్లెందులో విడుదల చేసిన ప్రకటనలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2025 సీజన్ కోసం తునికాకు సేకరణకు టెండర్లను ప్రకటించాలని కోరారు.

50 ఆకులతో కూడిన కట్టకు రూ.6 ప్రభుత్వ ధరగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్‌ను ఆదివాసీలకు తక్షణమే చెల్లించాలన్నారు. తునికాకు కూలీలకు రావాల్సిన బోనస్ డబ్బుల చెల్లింపులో అవకతవకలు జరిగినట్టు ఆరోపించారు. ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తునికాకు రేటును పెంచడం ద్వారా కూలీలకు ఉపాధితో పాటు ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందన్నారు. బహుళ ఆదాయం ఉన్న తునికాకు సేకరణకు ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

కనువిందు చేయనున్న కళల పండుగ

- నేటి నుంచి భద్రాద్రిలో 23వ అంతర్ రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు
- ప్రారంభించనున్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



శేషార్థం నాటిక (ఫైల్)

భద్రాచలం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కళలకు, కళాకారులకు పుట్టినిల్లులాంటి భద్రాచల పుణ్యక్షేత్రం మరోసారి అంతరాష్ట్ర నాటకోత్సవాలకు వేదిక కానుంది. 23 ఏళ్లగా భద్రాచలంలో భద్రాద్రి కళాభారతి ఆధ్వర్యంలో కళా ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మరోసారి మూడు రోజులపాటు 23వ అంతర్‌రాష్ట్ర నాటకోత్సవాలను మంగళవారం నుంచి నిర్వహించేందుకు భద్రాద్రి కళాభారతి సిద్ధమైంది. నేటినుంచి భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన తాళ్లూరి పంచాక్షరయ్య భారతీదేవి కళావేదిక ముస్తాబైంది. ఈ నాటకోత్సవాలను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రారంభించనుండగా రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, తాళ్లూరి ట్రస్టు చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య ప్రముఖులు పాల్గొననున్నారు.

కనువిందు చేయనున్న సాంస్కృతిక సంబురాలు

మంగళవారం ఉత్తరాంధ్ర సౌజన్య కళా స్రవంతి వారి దేవరాగం నాటిక ప్రదర్శించనున్నారు. అలాగే ప్రముఖ రంగస్థల నటి, గాయని హరిశ్చంద్ర ఫేం మంగాదేవి పద్యాలాపన, ఆత్మీయ పురస్కారం, ప్రముఖ జానపద గాయకుడు రేలా రేలా ఫేమ్ జానకిరావు జానపద పాటల సందడి, భాగ్యశ్రీ సాయి బృందం వారి నృత్య ప్రదర్శన నిర్వహించనున్నారు. 5న హైదరాబాద్‌కు చెందిన విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ వారిచే స్వేచ్ఛ నాటిక, పాడుతా తీయగా జూనియర్స్‌చే సినీ పాటల సందడి, కవి ఎన్‌సీహెచ్ చక్రవర్తి, జాతీయ పవర్ లిఫ్టింగ్ బంగారు పతక విజేత గాలి రామ్మోహన్‌రావు, పాల్వంచకు చెందిన ప్రముఖ రంగ స్థల నటులు, దర్శకులు పాకాలపాటి రోశయ్యచౌదరి, చర్లకు చెందిన నీలి నందేశ్వరరావులకు ఆత్మీయ సత్కారం నిర్వహించనున్నారు. 6న గుంటూరు అభినయ ఆర్ట్స్‌వారి ఇంద్రప్రస్థం నాటిక, యుద్ధనౌక గద్దర్ కుమార్తె డా.జీవీ వెన్నెలకు ఆత్మీయ పురస్కారం, తెలంగాణ ప్రభుత్వ గేయ రచయిత, అవార్డు గ్రహీత ఎస్.పాల్ పాటల సందడి, ఆత్మీయ సత్కారం, ఈ సమయంలో ప్రముఖ మిమిక్రీ కళాకారుడు రమేష్ ప్రత్యేక ప్రదర్శన చేయనున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులదే ఈ ఖ్యాతి

ఆర్టీసీ ఉద్యోగి అల్లం నాగేశ్వరరావు మదిలో మెదిలిన ఓ బృహత్తర ఆలోచనే భద్రాద్రి కళాభారతి. అదే అదునుగా తన సహచర ఉద్యోగులైన నర్సింహారావు, రాజా, ప్రతాప్, తిరుపతి, రామరాజు, శ్రీనివాసు, రమేష్‌లతో పంచుకున్న ఆలోచనే నేడు ప్రపంచస్థాయి దృష్టిని ఆకర్షిస్తోంది. ఉద్యోగం ద్వారా వచ్చిన జీతం సరిపోకపోయినా సరే సహచరులను ప్రోత్సహిస్తూ కళా ప్రేమికుల సహాయ సహకారాలతో అలుపెరగకుండా 23 ఏళ్లగా ప్రయాణం సాగిస్తోంది. 2001లో ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు ఎన్నో కళా ప్రదర్శనలు ఇస్తున్నారు. ఇప్పటివరకు 120 నాటికల వరకు ప్రదర్శనలు ఇప్పించి, ఎన్నో విజయాలు సాధిస్తూ ఎందరో కళాకారులకు సాహితీ ప్రియులకు గౌరవ సన్మానాలు చేస్తూ ముందుకు సాగుతోంది కళాభారతి. ప్రతి ఏటా ఫిబ్రవరిలో అంతర్ రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు నిర్వహిస్తూ నాటక రంగంలో భద్రాచలం పట్టణంలో ఓ గుర్తింపు తీసుకొచ్చింది. కళాభారతి సభ్యులు ప్రదర్శించిన అనేక నాటికలకు జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి పోటీల్లో అనేక అవార్డులు దక్కాయి.



దరఖాస్తులను స్వీకరిస్తున్న పీవో రాహుల్

'కోడ్' తర్వాత అర్జీలు పరిష్కరిస్తాం

ఐటీడీఏ పీవో బి.రాహుల్

భద్రాచలం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన దర్బార్‌లో గిరిజనులు అందజేసిన అర్జీల్లోని సమస్యలను ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అనంతరం పరిష్కరించడం జరుగుతుందని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం యూనిట్ అధికారులతో పీవో రాహుల్ మాట్లడుతూ గిరిజన దర్బార్‌లో పోడు భూముల పట్టాలు ఆన్‌లైన్ చేయడం, స్వయం ఉపాధి, జీవనోపాధికి సంబంధించిన దరఖాస్తులు, బోరు, మోటార్లు ఇప్పించేందుకు, రోడ్లు, కరెంటు సౌకర్యం కావాలని, సోలార్ విద్యుత్ సరఫరా ఇప్పించాలని పలు దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం దరఖాస్తులు ఎన్నికల కోడ్ ఉన్నందున, కోడ్ అనంతరం అర్జీలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, డీడీ మణెమ్మ, ఆర్సీవో గురుకులం నాగార్జునరావు, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఈఈ చంద్రశేఖర్, ఎస్వో భాస్కర్, ఏపీవో పవర్ వేణు, ఎస్‌డీసీ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

అప్పుల ఊబిలో మిరప రైతులు

- తగ్గిన దిగుబడులు... పెరిగిన పెట్టుబడులు
- ఈ ఏడాది నష్టాల ఘాటును మిగిల్చిన మిరప సాగు

బోనకల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పుడమి తల్లిని నమ్ముకొని ఇంటిల్లిపాది సేద్యం పైనే ఆధారపడి రెక్కలు ముక్కలయ్యేలా కష్టపడినా, చివరకు మిగిలేది అప్పులేనన్న భావనలో వాణిజ్య పంటలను సాగు చేస్తున్న రైతులు ఉన్నారు. ప్రతీ యేడు వచ్చే పంటతో తమ అప్పులు తీరతాయని ఆశిస్తున్న రైతులకు.. ఏదో ఒక రూపంలో నష్టాలు వెంటాడటం వల్ల కష్టాలు తీరడంలేదు.

ధరాఘాతంతో అప్పుల ఊబిలో మిరప రైతులు

మండలంలో ఈ ఏడాది ఐదు వేల ఎకరాల్లో మిరప పంటను సాగు చేశారు. మొదట్లో పైరు ఏపుగా పెరుగుతుండటంతో మంచి దిగుబడులు వస్తాయని రైతులు ఎంతగానో ఆశపడ్డారు. కానీ తాము ఒకటి తలిస్తే దైవం మరోటి తలిచినట్టుగా వరుస తెగుళ్ల మిరప రైతులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. వాటి నుంచి పైరును కాపాడుకునేందుకు రైతులు పెట్టుబడులు విపరీతంగా పెట్టారు. విత్తనం వేసిన దగ్గర నుంచి కోతల వరకు పెట్టుబడులు భారీగా పెరిగాయి. ఎకరం మిరప సాగు రూ.లక్షకు పైగా ఖర్చు వచ్చింది. దిగుబడులు మాత్రం ఎకరానికి పది క్వింటాళ్లకు లోపే వస్తుండడంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. పండించిన పంటకు ధర కూడా స్థిరంగా లేకపోవడంతో అన్నదాతలు కలవరానికి గురవుతున్నారు. క్వింటా మిరప ప్రస్తుతం జెండా పాటగా ధర రూ.14వేల ఉన్నప్పటికీ, గ్రామాల్లో మాత్రం క్వింటా రూ.11 వేలకు మించి కొనుగోలు చేయడం లేదు. క్వింటా మిరప కాయల కోతలకు రూ.3 వేల వరకు ఖర్చు వస్తోంది. పెట్టుబడి, కూలీల కోత ఖర్చులన్నీ కలిపితే సాగుకు చేసిన అప్పులు తీరే పరిస్థితి లేదని రైతులు లబోదిబోమంటున్నారు. మిరప సాగు తమకు ఘాటును మిగిల్చిందని గట్టెక్కే మార్గం కనిపించడం లేదని వాపోతున్నారు. పండించిన పంటకు స్థిరంగా గిట్టుబాటు ధర కల్పిస్తే కొంత మేరకైనా బయట పడతామని రైతులు ఆశిస్తున్నారు.



ధర తగ్గి, పెట్టుబడి పెరగడంతో అప్పులు తీరేలా లేవు

కష్టపడ్డా.. మిరప సాగు కలిసి రాలేదు

చినకేసి కృష్ణ, రైతు, ఆళ్లపాడు



మూడెకరాల భూమిలో మిరప పంటను సాగు చేశా. పంటను దక్కించుకోవడానికి పెట్టుబడి బాగా పెట్టా. ఎకరానికి రూ.లక్షకు పైగా పెట్టుబడిగా ఖర్చు చేశా. మిరప కాయలను ఏరించేందుకు క్వింటాకు రూ.3వేల వరకు ఖర్చు వచ్చింది. తెగుళ్ల వల్ల దిగుబడి బాగా తగ్గింది. మిరపకు ధర కూడా తగ్గిపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

ఆవుల వీరబాబు, రైతు, ఆళ్లపాడు



రెండు ఎకరాల పొలంలో మిరప పంటను సాగు చేశా. ఎకరానికి పది క్వింటాళ్ల లోపే దిగుబడి వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. గ్రామంలో క్వింటా మిరప కాయలను రూ.11 వేల వరకు కొంటున్నారు. పెట్టుబడులు బాగా పెరిగాయి. చేసిన అప్పులు తీరే మార్గం కనిపించడం లేదు. ఏం చేయాలో పాలు పోవడం లేదు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

- సంక్షేమం, అభివృద్ధి పథకాలు అమలు చేయాలి
- ఐటీడీఏ ఎదుట ఏఎస్‌పీ ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, సంక్షేమం, అభివృద్ధి పథకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో భద్రాచలంలో సోమవారం ప్రదర్శన, ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహించారు. 1950 రాష్ట్రపతి గెజిట్‌కాలం 25లో ఉన్న తెగలను ఎస్టీలుగా గుర్తించాలని సమగ్ర నివేదిక (జనాభా లెక్క) పరిగణలోకి తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. ఏజెన్సీలో పెసా, 1/70, ఎల్టీఆర్ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈ సమయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు వినతిపత్రాన్ని రాసి దానిని అధికారులకు అందజేశారు. అలాగే దీని ప్రతిని దేశ ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రెండు తెలుగు రాష్ట్రాల గవర్నర్లు, జిల్లా కలెక్టర్లు, జాతీయ గిరిజన కమిషన్‌కు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి సమర్పించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు, ఉపాధ్యక్షుడు పొడియం నరేంద్రకుమార్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ ప్రధాన కార్యదర్శి సున్నం వెంకటరమణ, నర్సింహారావు, ఆదివాసీ సమైక్య నాయకులు సునీల్, హరీష్, కట్టం కోసా, వెట్టిభీమా, దేవా, చలపతి, నంద, పొంచెం అనిల్, సోడే గంగ పాల్గొన్నారు.

ఎర్రబంగారం వెలవెల

(5వ పేజీ తరువాయి)

దిగుబడి పెరగడంతో మార్కెట్‌లో ధర కూడా ఆశాజనకంగా ఉంటే తమ కష్టాలు తీరతాయని రైతులు భావించినా మార్కెట్ పరిస్థితి దారుణంగా ఉంది. విదేశీ ఎగుమతుల ఆర్డర్లు పెద్దగా లేకపోవడంతో ఆ ప్రభావం మిర్చి ధరపై పడింది. గతేడాది క్వింటాకు రూ.21వేల వరకు ధర పలకగా ప్రస్తుతం రూ.13వేల నుంచి రూ.15,000వరకు మాత్రమే ధర పలుకుతోంది. ఖమ్మం మార్కెట్‌లో గత వారం రోజులుగా క్వింటాకు రూ.14వేల వరకే పరిమితం కాగా, సోమవారం రూ.14,200 ధర పలికింది. పేరుకు జెండాపాంట రూ.14వేలుగా ఉన్నా వ్యాపారులు అనేక కొర్రీలు పెట్టి ధర తగ్గిస్తున్నారు. దీంతో రైతులు క్వింటాకు రూ.5నుంచి రూ8వేలు నష్టపోయే పరిస్థితి నెలకొంది.

విదేశీ ఎగుమతులు తగ్గడంతో నిరాశ

ఈ ఏడాది మిర్చిపంట విదేశాల్లో కూడా సమృద్ధిగా సాగయింది. ఆ ప్రభావం ఎగుమతులపై పడింది. ఏటా చైనా, మలేషియా, ఇండోనేషియా, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాలకు ఖమ్మం మార్కెట్‌తోపాటు రాష్ట్రంలో పలు జిల్లాలో పండే మిర్చి ఎగుమతి అవుతుంది. దేశీయంగా ఢిల్లీ, యూపీ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, బీహార్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల మార్కెట్లకు ఇక్కడి మిర్చి ఎగుమతి అవుతుంది. అయితే ఈసారి విదేశీ ఆర్డర్లు తగ్గడంతో ప్రస్తుత ఉత్పత్తులు దేశీయ అవసరాలకే వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కారం, ఆయిల్, సాస్, కలర్స్, మెడిసిన్‌తోపాటు పలు రకాల ఉత్పత్తుల్లో తేజా మిర్చిని వినియోగిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో గుంటూరు, ఖమ్మం మార్కెట్ల నుంచి ఈసారి ఎగుమతి ఆర్డర్లు తగ్గడంతో స్థానిక వ్యాపారులే మిర్చిని కొనాల్సి వస్తోంది.

నష్టపోయిన ఏసీ మిర్చి రైతులు

గతేడాది మిర్చి సీజన్‌లో వ్యాపారులు క్వింటాకు రూ.20వేలకు పైగా ధర చెల్లించి ఏసీ గోదాంలలో పంట నిల్వ చేశారు. ఆగస్టు నాటికి ధర పెరుగుతుందని భావించినా పెద్దగా ధర పెరగకపోగా తగ్గుదల కనిపించడంతో ఖమ్మం ఏసీ గోదాంలలో నిలువ ఉంచిన మిర్చిని క్వింటాకు మొదట్లో రూ.18వేలు ఆ తర్వాత రూ.15 వేలకే అమ్ముకున్నారు. 30లక్షల బస్తాలు ఏసీ గోదాంలలో ఉంచిన వ్యాపారులు క్రమంగా వాటిని అమ్ముకున్నారు. కొంతమంది రైతులు కూడా గతేడాది తమ పంటను విక్రయించకుండా ఏసీ గోదాముల్లో నిల్వ చేశారు. వారంతా నష్టాలకే తమ పంటను విక్రయించుకోవాల్సి వచ్చింది. క్వింటాకు రూ.5నుంచి 6వేల వరకు తక్కువకు అమ్ముకోవాల్సి వచ్చింది.

వెల్లువెత్తిన ఎర్రబంగారం

ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఎర్రబంగారం (తేజ రకం కొత్త మిర్చి) పోటెత్తింది. సోమవారం సుమారు 60 వేల మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. కొత్త మిర్చి సీజన్ ప్రారంభమైనాక తొలిసారిగా పంట ఇంత భారీ మొత్తంలో రావడం ఇదే ప్రథమం. మార్కెట్‌కు వారం రోజుల క్రితం 50 వేల బస్తాలు రాగా, శని ఆదివారాలు రెండు రోజులు వరుస సెలవుల అనంతరం మరోసారి రైతులు పంటను భారీగా అమ్మకానికి తెచ్చారు. దీంతో మార్కెట్ యార్డులు ఉదయం 7గంటల కల్లా మిర్చి బస్తాలతో నిండిపోయింది. ఇదిలా ఉండగా మార్కెట్లో క్వింటాలు మిర్చి రూ.14,200 నిర్ణయించగా నాణ్యతను బట్టి క్వింటాలు రూ. 10,000 నుంచి రూ.13,500 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. అంతే కాకుండా మార్కెట్‌కు సోమవారం సుమారు 1507 పత్తి బస్తాలు రాగా.. అత్యధిక ధర క్వింటాలుకు రూ.7,150 పలికింది. నాణ్యతను బట్టి వ్యాపారులు క్వింటాలు పత్తిని రూ. 5,000 నుంచి రూ. 6,800 వరకు కొనుగోలు చేశారు. మిర్చి కొనుగోళ్లను మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, సెక్రటరీ ప్రవీణ్‌రెడ్డి, గ్రేడ్ టూ సెక్రటరీ సృజన్‌కుమార్, అసిస్టెంట్ సెక్రటరీ వీరాంజనేయులు సమీక్షించారు.

అప్రజాస్వామికంగా కేంద్ర బడ్జెట్

(5వ పేజీ తరువాయి)

నిధులు కేటాయించలేదని ఆరోపించారు. పాలమూరు, సీతారామ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు జాతీయ హోదా ప్రకటించపోవడాన్ని తీవ్రంగా ఖండించారు.

రాష్ట్రంలోని సమస్యలపై గతేడాది కాలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి రాష్ట్ర మంత్రుల వరకు 30 సార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి వివరించి నివేదికలు ఇచ్చినా స్పందన లేదన్నారు. పక్క రాష్ట్రాలకు నిధులు కేటాయించటంపై తమకు అభ్యంతరం లేదని, కానీ అదే స్థాయిలో తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు. తెలంగాణ నుంచి జీఎస్‌టీ ట్యాక్స్‌ల రూపంలో కేంద్రానికి 5 శాతం డబ్బు వెళ్తుండగా వాటిలో కేవలం 2.5శాతం నిధులనే రాష్ట్రానికి కేటాయిస్తున్నారని మంత్రి ధ్వజమెత్తారు.

కేంద్ర ప్రభుత్వం తన రాజకీయ అవసరాల కోసం బీజేపీ పాలిత రాష్ట్రాలతోపాటు త్వరలో ఎన్నికలు రాబోయే రాష్ట్రాలకు అధికంగా నిధులు కేటాయించిందని ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల మనోభావాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. కేంద్ర బడ్జెట్ తీరుపై రాష్ట్రంలోని బీజేపీ నాయకులు ప్రజలకు సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యర్రగర్ల హనుమంతరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం నగర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్‌చౌదరి, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు దొబ్బల సౌజన్య, బొడ్డు బొందయ్య, మెక్కా శేఖర్‌గౌడ్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రథసప్తమి

భద్రాచలం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రథ సప్తమిని పురస్కరించుకొని మంగళవారం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి 5 గంటల వరకు సుప్రభాతం, తిరువారాధన, సేవాకాలం, శాత్తుమురై, 5 నుంచి 6 గంటల వరకు చిత్రకూట మండపంలో అలంకారం, ఆదిత్య హృదయం శ్రీరామస్తుతి, ఉపదేశాత్మక పారాయణం, శ్రీ సీతారామచంద్రస్వామి వారికి సూర్యప్రభ వాహన సేవ నిర్వహించి దర్బారు సేవ అనంతరం చంద్రప్రభ వాహన సేవ నిర్వహించనున్నారు.

గోశాలకు రూ.56,424 విరాళం

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి చెందిన గోశాలకు ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అంజనాపురానికి చెందిన కవితాశ్రీహరి దంపతులు గోశాల నిమిత్తం రూ.56,425 విరాళంగా అందించారు.

జర్నలిస్టులకు భూ కేటాయింపును పరిశీలిస్తున్నాం..

- అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



అదనపు కలెక్టర్‌తో జర్నలిస్టు సంఘాల నాయకులు

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు సంబంధించి భూ కేటాయింపు అంశాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిశీలించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచన మేరకు సోమవారం ఖమ్మంలోని మూడు ప్రధాన జర్నలిస్టు సంఘాలు, స్తంభాద్రి హౌసింగ్ సొసైటీ ప్రతినిధుల బృందం అదనపు కలెక్టర్‌ను క్యాంపు కార్యాలయంలో కలిశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపుపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ జీవోలు, సొసైటీ ఏర్పాటు, సుప్రీంకోర్టు తీర్పు వంటి అంశాలను ఈ సమావేశంలో జర్నలిస్టు బృందం ప్రతినిధులు ఆయనకు తెలియజేశారు. మొదటి ప్రాధాన్యతలో ఖమ్మం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని యూనియన్లు, సొసైటీ ప్రతినిధుల బృందం కోరింది. దీంతో న్యాయ నిపుణులను సంప్రదించి ఒక నిర్ణయం తీసుకుంటామని మూడు యూనియన్లు, హౌసింగ్ ప్రతినిధులకు అదనపు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆయనను కలిసిన వారిలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, టీ యూడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పల్లా కొండలరావు, టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా కార్యదర్శి చిర్రా రవికుమార్, స్తంభాద్రి సొసైటీ అధ్యక్షుడు కనకం సైదులు, కోశాధికారి వెన్నబోయిన సాంబశివరావు, ఫెడరేషన్ నాయకుడు రాము తదితరులు వున్నారు.

ఊరిస్తున్న 'విమాన' కల

(5వ పేజీ తరువాయి)

సభ్యులతో కూడిన కేంద్ర సర్వే బృందం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా భద్రాద్రి జిల్లా కలెక్టర్, సంబంధిత అధికార యంత్రాంగం కూడా ఆ స్థలంపై సర్వే అధికారులకు పూర్తి అవగాహన కలిగేలా మ్యాప్‌లను, వీడియోలను సైతం అందజేశారు. కొత్తగూడెం కలెక్టరేట్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సర్వే బృందానికి వివరించారు. దీంతో వారు సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

అయితే ఆ స్థలాల్లో చిన్నచిన్న గుట్టలు, పిల్లకాల్వలు ఉన్న విషయం సర్వే బృందం దృష్టికి రావడంతో అటువంటి కొద్దిపాటి స్థలాన్ని వదిలేసి దానికి అనుసంధానంగా మరికొంత స్థలం సేకరిస్తే అక్కడ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఎలాంటి అడ్డంకులు ఉండవని సర్వేబృందం తెలిపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కేంద్ర బృందం సూచించిన ప్రకారం భూమిని సేకరించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. మొత్తంగా కేంద్రప్రభుత్వ కొత్త ఉడాన్‌పథకంలో కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు చోటు కల్పించేందుకు మంత్రి తుమ్మలతో పాటు జిల్లా యంత్రాంగం తీవ్రంగా కృషి చేస్తోంది.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు వేదికగా భద్రాద్రి

- కొత్తగూడెంలో 6నుంచి వెటరన్ రాష్ట్రస్థాయి పోటీలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు వేదికగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆవిర్భవించిందని, ఈ పోటీలకు అన్ని ఏర్పాట్లను చేసి విజయవంతం అయ్యేందుకు కృషి చేయాలని జిల్లా షటిల్ బ్యాట్మింటన్ అసోసియేషన్ సభ్యులను కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం సూచించారు. ఈ 10వ వెటరన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కలెక్టర్‌ను ఆహ్వానించి అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. ఈ పోటీలు ఈ నెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు కొత్తగూడెంలో జరుగనున్నాయి. కార్యక్రమంలో జిల్లా బ్యాట్మింటన్ సెక్రటరీ డాక్టర్ సావిత్రి, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ యుగేందర్‌రెడ్డి, కార్యదర్శి రాజేంద్రప్రసాద్, టెన్నిస్ అసోసియేషన్ ఉపధ్యక్షులు ఆనం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపాలి



క్రీడాకారులకు జెర్సీలు అందజేస్తున్న అసోసియేషన్ చైర్మన్, కార్యదర్శులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి03(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపాలని భద్రాద్రి జిల్లా అసోసియేషన్ చైర్మన్, కార్యదర్శి చీకటి కార్తీక్, స్వాతి ముత్యం అన్నారు. సోమవారం కొత్తగూడెం ప్రకాశం మైదానంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సీనియర్ కబడ్డీ జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలలో ప్రతిభ చూపి జిల్లాకు ఎంపికైన 12 మంది క్రీడాకారులకు టీషర్టులతో పాటుగా కబడ్డీ కిట్లను అందించారు. ఎంపికైన క్రీడాకారులు మంగళవారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు అదిలాబాద్ జిల్లాలో జరిగే 71వ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల కబడ్డీ టోర్నమెంట్‌కు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈసం లక్ష్మీనారాయణ, యూత్ కాంగ్రెస్ నాయకులు గులాం మతిన్, కుంచం వెంకటేష్, తాటి పవన్, రామ్మూర్తి, పల్లి ప్రణయ్, మద్దెల జైసూర్యం, సాయి ప్రకాశ్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో సొసైటీ అధ్యక్షుడు

టేకులపల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రైతులకు మొలకెత్తని మొక్కజొన్న విత్తనాలు అంటగటానే కొంతమంది రైతుల ఫిర్యాదు మేరకు మండలంలోని బేతంపూడి సొసైటీ అధ్యక్షుడు లక్కినేని సురేందర్‌రావును సోమవారం టేకులపల్లి పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. రైతులకు మొలకెత్తని మొక్కజొన్న విత్తనాలు అంటగట్టాడని పలువురు రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. టేకులపల్లి పోలీసుల కథనం ప్రకారం మండలంలోని చంద్రుతండా పంచాయతీ పరిధిలోని కొంతమంది రైతులకు ఓ సీడ్ కంపెనీకి చెందిన ఆడ, మగ మొక్కజొన్న విత్తనాలను సురేందర్‌రావు ఇప్పించి వేయించాడు. ఆ సీడ్ కంపెనీ ద్వారా విత్తనాలు, కలుపు మందు ఉచితంగానే ఇచ్చారు. కాని కొంత మంది రైతుల చేలల్లో అవి మొలకెత్తలేదు. విత్తనాలు మొలకెత్తకపోవడంతో రైతులు నష్ట పరిహారం ఇవ్వాలని సురేందర్‌రావుకు తెలపడంతో ఎకరాకు రూ.20వేలు ఇచ్చేవిధంగా ఒప్పందం చేసుకొన్నారు. కాని ఆ సొమ్మును రైతులకు అందించక పోవడంతో రైతులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో సురేందర్ రావు, మరోవ్యక్తి రాజాలపై పోలీసులు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకొన్నారు. మొక్కజొన్న విత్తనాల వల్ల నష్టపోయిన గిరిజన రైతులు నష్ట పరిహారం చెల్లించాలని కోరడంతో వారిపై లక్కినేని సురేందర్‌రావు దురుసుగా ప్రవర్తించాడని ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈ మేరకు సోమవారం లక్కినేని సురేందర్‌రావును అదుపులోకి తీసుకొని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను ఎస్సీఎస్టీ కేసుపై విచారణ నిర్వహించారు.

ఎస్ఐల శిక్షణకు పోలీస్ స్టేషన్ల కేటాయింపు



ఖమ్మంక్రైం,ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతిప్రతినిధి): 9మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లకు ఐదునెలల శిక్షణలో భాగంగా వివిధ పోలీస్ స్టేషన్లను సీపీ సునిల్‌దత్ సోమవారం కేటాయించారు. ఇటీవల ట్రైనింగ్ పూర్తిచేసుకుని ఖమ్మం కమిషనరేట్‌లో రిపోర్టుచేసిన 9మంది సోమవారం సీపీని కార్యాలయంలో కలిశారు. వారికి సీపీ శుభాకాంక్షలు తెలిపారు. పోస్టింగ్‌లు కేటాయించిన వారిలో ఖమ్మంరూరల్‌కు బాదావత్ హరికృష్ణ, రఘునాధపాలేనికి మెడం తేజేశ్వరరెడ్డి, సత్తుపల్లికి గడ్డాల అశోక్‌కుమార్, ఖమ్మంవన్‌టౌన్‌కు రామకృష్ణ, వైరాకు వెంపటి పవన్, ఖమ్మం త్రీటౌన్‌కు కొండా సురేష్, తల్లాడకు బానోతు వెంకటేష్, ఖమ్మంటుటౌన్‌కు వారంపల్లి రమేష్, ఖానాపురం హవేలికి సైనీ నావితను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

53మంది బాల కార్మికులకు విముక్తి

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఆపరేషన్ స్మైల్11 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారని, పోలీసుకమిషనర్ సునీల్‌దత్ సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. ఈఏడాది జనవరి 1నుంచి 31వరకు నిర్వహించిన కార్యక్రమంలో కమిషనరేట్ పరిధిలో 53 మంది బాలబాలికలలను గుర్తించి విముక్తి కలిగించామన్నారు. ఇందులో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు16మంది తెలంగాణకు చెందిన 37మంది ఉన్నట్టు తెలిపారు. బాలల హక్కులు కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు బాధ్యతాయుతంగా కృషిచేయాలన్నారు.

క్రీడాకారులకు సీపీ అభినందన



ఖమ్మంక్రైం,ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్ర 3వపోలీసు గేమ్ అండ్ స్పోర్ట్స్‌మీట్ 2025లో భాగంగా 42పతకాలు సాధించిన పోలీసు క్రీడాకారులను సీపీ సునిల్‌దత్‌సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. కరీనంగర్‌లోని పోలీస్‌పరేడ్ మైదానంలో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరిగిన పోటీల్లో 29క్రీడాంశాలకు 20 పోలీసు జోన్ల నుంచి సుమారు 2400మంది పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఏడీసీపీలు కుమారస్వామి, విజయ్‌బాబు, ఏసీపీలు నరసయ్య, సుశీల్‌సింగ్, పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో రెండు జాతీయ పతకాలు

కొత్తగూడెంపోస్టాఫీస్‌సెంటర్, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడేనికి చెందిన హెడ్ కానిస్టేబుల్ పి.వీరభద్రం జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్-2025 పోటీల్లో రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చాటారు. కేరళలో సోమవారం స్పీడ్‌వాక్‌లో పాల్గొని వెండి పతకం, 1500 మీటర్ల పరుగు పందెంలో మూడోస్థానంలో నిలిచి రజత పతకాలు సాధించాడు.



పతకాలు అందుకున్న వీరభద్రం

గోదాముల్లో నిండుకున్న బియ్యం

- రేషన్ దుకాణాలకు సరఫరా కాని వైనం
- సన్నాల కొనుగోలుతో ఖమ్మం జిల్లాలో బియ్యం కొరత

ఖమ్మంకలెక్టరేట్, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): గోదాముల్లో రేషన్ బియ్యం నిండుకున్నాయి. ఈనెల రేషన్ బియ్యాన్ని నేటికీ సరఫరా చేయకపోవడంతో డీలర్లు అధికారుల చుట్టూ ప్రదిక్షణలు చేస్తున్నారు. దీంతో జిల్లాలో ఫిబ్రవరి కోటాకు సంబందించిన బియ్యానికి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సన్నాల సాగు, సన్న రకం వడ్లనే ప్రభుత్వం కొనుగోలు చేయడంతో జిల్లాలో బియ్యం కొరత ఏర్పడింది. గోదాముల్లో నిల్వలు నిండుకోవడంతో ఎంఎల్ఎస్ పాయింట్లలో బియ్యంలేక రేషన్ డీలర్లు వెనుదిరుగుతున్నారు. ప్రతీ నెలా ఒకటో తారీకు నుంచి లబ్ధిదారులకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాల్సి ఉంటుంది. ప్రతీ నెలా 1నుంచి 15వరకు బియ్యాన్ని పంపిణీ చేసి మిగులు బియ్యాన్ని లెక్కచూపితే ప్రతీనెలా 16నుంచి18 వరకు తిరిగి ఆయా డీలర్లకు కార్డుల వారీగా కేటాయింపు చేస్తారు. 18తర్వాత నుంచి ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు బియ్యాన్ని పంపిణీ చేస్తుంటారు. అయితే ఈనెల (ఫిబ్రవరి) కోటాకు సంబందించిన బియ్యం గోదాముల్లో లేకపోవడంతో బియ్యం పంపిణీకి బ్రేక్ పడింది.

ఖమ్మం జిల్లాలో 784 రేషన్ దుకాణాలు

ఖమ్మం జిల్లాలో 784 రేషన్ దుకాణాల ద్వారా ప్రతీనెలా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన నాలుగు కొత్తపథకాల్లో భాగంగా అదనంగా 485 రేషన్ కార్డులు మంజూరయ్యాయి. వీటితో కలుపుకుని జిల్లా వ్యాప్తంగా అంత్యోదయ కార్డులు 27,274, రేషన్‌కార్డులు 3లక్షల 84,289, అన్నపూర్ణ కార్డులు3 మొత్తం 4,12,566 కార్డులున్నాయి. వీటిలో 11లక్షల 29,030 మంది లబ్ధిదారులున్నారు. వీరికోసం ఈనెల 6152 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉంటుంది. అయితే జిల్లాలో ఉన్న గోదాముల్లో బియ్యం నిల్వలు లేకపోవడంతో పక్క జిల్లాపై ఆధారపడాల్సి వచ్చింది. ఏటా ఇలాంటి కొరత ఏర్పడుతున్నా అధికారులు మాత్రం ముందస్తు చర్యలు తీసుకోవడం లేదు.

రెండురోజుల్లో బియ్యం తెప్పిస్తున్నాం
డీఎస్‌వో చందన్‌కుమార్



జిల్లాకు అవసరమైన రేషన్ బియ్యాన్ని సూర్యాపేటకు ఈనెలకు కేటాయించారు. రెండు రోజుల్లో బియ్యం గోదాముల ద్వారా ఎంఎల్ఎస్ పాయింట్లకు సరఫరా చేస్తాం. అక్కడి నుంచి రేషన్ దుకాణాలకు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు ఇచ్చిన సీఎంఆర్ బియ్యం 10శాతం గోదాములకు చేరుకున్నాయి. ఉగాది నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యాన్ని సరఫరా చేయాలన్న లక్ష్యానికి అనుగుణంగా సన్నధాన్యాన్ని సిద్ధం చేస్తున్నాం.



ఇదీ రేషన్ లెక్క

రేషన్ దుకాణాలు :	784
కొత్త రేషన్ కార్డులు:	425
అంత్యోదయ కార్డులు:	27,274
రేషన్‌కార్డులు:	3,84,289
అన్నపూర్ణ కార్డులు:	3
మొత్తం కార్డులు:	4,11,566
మొత్తం లబ్దిదారులు:	11, 29,030
ఈనెలకేటాయింపు:	6152 (మె.ట)

అలరిస్తున్న రామదాసు కీర్తనలు

కొనసాగుతున్న భక్తరామదాసు వాగ్గేయకార ఉత్సవాలు

భద్రాచలం, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భక్తరామదాసు జయంతి ప్రయుక్త వాగ్గేయకార ఉత్సవాలు భక్తులను అలరిస్తున్నాయి. కళాకారులు ఆలపిస్తున్న రామదాసు గేయాలు భక్తులను అలరిస్తున్నాయి.కంచర్ల శ్రీనివాసరావు భజన బృందం భక్తులను ఆకట్టుకుంది. అలాగే బూర్లె అంజనీదేవి, డి.నిహారిక, ఎనమంద్ర శ్రీనివాస శర్మ, వాగ్దేవి, వైష్ణవిల సంగీత కచేరి ఆహుతులను ఆకట్టుకుంది. బి.లలితామాధవ్ వారి బృందం కీర్తనలు సైతం ప్రేక్షకులను మంత్రముగ్దులను చేశాయి. దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, పర్యవేక్షకులు లింగాలసాయిబాబా పర్యవేక్షణ చేయగా, వ్యాఖ్యతగా శ్రీరామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు వ్యవహరించారు. సంస్కృత పండితులు ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులు భక్తర్మాదాసు వాగ్గేయకార ఉత్సవాలకు శ్రీకారం ఎలా చుట్టారు, గతంలో నిర్వహణ ఎలా సాగింది అనే అంశాలను ఆహుతులకు వివరించారు. ఈ సమయంలో ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులను భక్తరామదాసు వారసులు కంచర్ల శ్రీనివాసరావు, దేవస్థానం అధికారులు ఘనంగా సన్మానించారు.



కంచర్ల శ్రీనివాసరావు బజన బృందం రామదాసు గీతాల ఆలాపన

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి

- అధికారులు సిద్ధంగా ఉండాలి
- రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి
- స్థానిక ఎన్నికలపై వీడియో కాన్ఫరెన్స్

ఖమ్మంకలెక్టరేట్, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి):రాబోయే స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీల ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని రాష్ట్రఎన్నికల కమిషన్ కార్యదర్శి ఎం.అశోక్ కుమార్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఆయన స్థానిక ఎన్నికల నిర్వహణపై అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమీక్షలో ఖమ్మం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ పాల్గొన్నారు. గ్రామపంచాయతీలలో 2వ సప్లిమెంట్ ఓటరు జాబితా మ్యాపింగ్, మండలాలకు ఎంపీటీసీల కేటాయింపు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన మ్యాన్ పవర్, బ్యాలెట్ బాక్సుల సన్నద్దత, సిబ్బందికి అవసరమైన శిక్షణ, రిటర్నింగ్ అధికారుల నియామకం, బ్యాలెట్ పేపర్ల ముద్రణ తదితర అంశాలపై ఆయన చర్చించారు. గ్రామ పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ఎంపీటీసీ పరిధి చెక్ చేసుకోవాలని, ఎంపీడీవోలు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో దీక్షా రైనా, డీపీవో ఆశాలత, డిప్యూటీ సీఈవో కె.నాగపద్మజ, డీఎల్పీవో. రాంబాబు పాల్గొన్నారు.



బ్యాలెట్ పేపర్లను పరిశీలన చేస్తున్న శ్రీజ

బ్యాలెట్ పత్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియలో కీలకంగా వినియోగించే బ్యాలెట్‌పత్రాలను సోమవారం ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీజ పరిశీలించారు. డీపీఆర్సీ భవనంలో ఉంచిన బ్యాలెట్ పత్రాలను పరిశీలించారు. మొత్తం సర్పంచి బ్యాలెట్ పత్రాలు 9లక్షల 50వేలు, వార్డు సభ్యుల బ్యాలెట్ పత్రాలు 9లక్షల 50వేలు ప్రింటింగ్ చేసి సిద్ధంగా ఉంచారు. తాజాగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారన్న ప్రచారంతో బ్యాలెట్ పత్రాల లెక్కలు, వాటి ప్రింటింగ్ సక్రమంగా ఉందా లేదా అనే అంశాలను ఎంపీడీవోలు, డీఎల్పీవోలు జిల్లా పంచాయతీ అధికారులు పరిశీలించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయిన తర్వాత వాటిని ఆయా మండలాలకు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. జడ్పీసీఈవో దీక్షరైనా, డీపీవో ఆశాలత, డీఎల్పీవో రాంబాబు ఈ పరిశీలనలో ఉన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలి

భద్రాద్రి డీఈవో వెంకటేశ్వరచారి

కరకగూడెం, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న పదిపరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డీఈవో వెంకటేశ్వరచారి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించిన డీఈవో మండలంలోని పాఠశాలల పరిస్థితులు, ఉపాధ్యాయుల వివరాలను ఎంఈవో మంజూలను అడిగి తెలుసుకున్నారు. 2025-26 విద్య సంవత్సరం గాను నవోదయ తాత్కలిక పాఠశాల ఏర్పాటు కోసం కరకగూడెం జిల్లా పరిషత్ పాఠశాల భవనాన్ని పరిశీలించారు. జిల్లా పరిషత్ పాఠశాలలో నవోదయ తరగతులను ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎంవో నాగరాజ్ శేఖర్, ఎంఈవోలు గడ్డం మంజూల, వీరస్వామి, సీఆర్‌పీ జయబాబు, నవోదయ టీం పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి




రమేష్(ఫైల్)

సుజాతనగర్ , ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువ రైతు మృతి చెందిన సంఘటన సుజాతనగర్ మండల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన మృతుడు కొర్రా రమేష్(33) సోమవారం తప పొలంలోని విద్యుత్ మోటారు ఆన్ చేసే క్రమంలో విద్యుత్ షాక్ తగలడంతో అక్కడే కుప్ప కూలిపోయాడు. ఆసమ యంలో ఆ చుట్టు పక్కల ఎవరూ లేకపోవడంతో పరిస్థితి మరింత విషమంగా మారిందని, కుటుంబ సభ్యులు అతడి కోసం వెతకగా పొలం వద్ద కనిపించాడు. వెంటనే అతడిని కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అతడిని పరిశీలించిన డాక్టర్లు అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి ....

బూర్గంపాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టరు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి సమయంలో నకిరిపేట వద్ద చోటుచేసుకుంది. మండల పరిధిలోని టేకులచెరువు గ్రామానికి చెందిన చింతనిప్పు మురళికృష్ణ(35) ఆదివారం రాత్రి సమయంలో వ్యక్తి గత పని మీద ద్విచక్ర వాహనంపై లక్ష్మీపురం వెళ్లి తిరిగి ఇంటికి వెళుతుండగా నకిరిపేట వద్ద ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. సోమవారం మృతుడు తమ్ముడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు...



వైద్యం అందిస్తున్న తెల్లం వెంకట్రావు

చర్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా, నలుగు రికి గాయాలైన సంఘటన చర్ల మండలం తాలిపేరు ప్రాజెక్టు వద్ద జరిగింది. వివరాల ప్రకారం.. చర్ల మండలం పెద్ద మిడిసిలేరు గ్రామం నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం జీడిపల్లి వైపు ఓ ద్వి చక్ర వాహనం వెళ్తుండగా, చర్ల మండలం తిప్పాపురం వైపు మరో మోటార్ సైకిల్ వెళ్తుండగా, ఇదే క్రమంలో ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో పవన్, దేవా, విజయ్‌కుమార్, దేవా అనే నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. తిప్పాపురం చెందిన ఎం. రాంబాబు (35) అనే యువకుడు మృతి చెందాడు.

భద్రాద్రి కొత్త గూడెం జిల్లా చర్ల మండలం ఆర్‌కొత్తగూడెం వద్ద సోమవారం టాటా మ్యాజిక్ మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఇదే క్రమంలో చర్ల వెళ్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంట్రావు వారికి వైద్యం అందించి, తనవాహనంలో సత్యనారాయణపురం వైద్యశాలకు తరలించారు. గాయపడిన వారిలో వ్యక్తి పరిస్థితి ఆందోళన కరంగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరిది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంగా స్థానికులు చెబుతున్నారు.

రూ.19 లక్షలకు దివాళా పిటీషన్ దాఖలు

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం కల్లూరు గ్రామానికి చెందిన మినరల్ వాటర్ వ్యాపారి చావా శ్రీనివాసరావు 19 లక్షల 50వేలకు సోమవారం ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో మొత్తం 15మంది ప్రతివాదులుగా చూపిస్తూ దివాళా పిటీషన్ తన న్యాయవాది ద్వారా దాఖలుచేశారు.

భార్య హత్య కేసులో భర్త రిమాండ్

దుమ్ముగూడెం ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గోవిందాపురంలో గత నెల 31న భార్యను హత్యచేసిన సంఘటనలో నిందితుడైన భర్తను పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. తాటి జయను భర్త తాటి నర్సింహారావు హత్యచేసిన విషయం తెలిసిందే. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

భద్రాద్రిలో ఎమ్మెల్సీ ఓటర్లు 1,949మంది

- పురుష ఓటర్లు 1,038, మహిళా ఓటర్లు 911 మంది
- 23 పోలింగ్‌స్టేషన్ల ఏర్పాటు



కొత్తగూడెం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం డివిజన్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు మొత్తం ఓటర్లు 1,949 మంది డిసెంబరుకు తుదిజాబితాలో ప్రకటించారు. వీరిలో 1038మంది పురుష ఓటర్లు కాగా 911మంది మహిళ ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. మొత్తం 23 మండలాల్లో 23 పోలింగ్‌స్టేసన్లను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క మండలానికి ఒక్కొక్క పోలింగ్‌స్టేషన్‌ను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. సోమవారం నుంచి నామినేషన్లను కూడా స్వీకరిస్తున్నారు. జిల్లాలో కొత్తగూడెం డివిజన్ కింద 15 మండలాలు, భద్రాచలం డివిజన్ కింద 8 మండలాలుగా మొత్తం రెండు డివిజన్లను ఏర్పాటు చేశారు. మండలాల వారీగా ఓటర్లు పురుష, మహిళ ఓటర్లు కలిపి ఈ విధంగా ఉన్నాయి.

ఆళ్లపల్లి మండలంలో 14 ఓట్లు, అన్నపురెడ్డిపల్లిలో 19 ఓట్లు, అశ్వపురం మండలంలో 35, అశ్వరావుపేట మండలంలో 46, భద్రాచలంలో 250, బూర్గంపాడులో 56, చంద్రుగొండలో 16, చర్ల మండలంలో 51, చుంచుపల్లి మండలంలో 175, దమ్మపేటలో 75, గుండాల మండలంలో 13, జూలూరుపాడులో 58, కొత్తగూడెం మండలంలో 18, కొత్తగూడెం పట్టణంలో 167, లక్ష్మీదేవిపల్లి మండలంలో 87, మణుగూరులో 110, ములకలపల్లిలో 25, పాల్వంచ మండలంలో 243, పినపాకలో 35, సుజాతనగర్‌లో 62, టేకులపల్లిలో 127, ఇల్లెందు మండలంలో 210 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. కొత్తగూడెం డివిజన్‌లోని 15 మండలాలకు పార్ట్ నెంబర్లుగా 77, 78, 80, 83, 85, 86, 88, 89, 91, 92, 94, 95, 97, 98, 99 పార్టు నెంబర్లుగా గుర్తించారు. భద్రాచలం డివిజన్‌లోని 8 మండలాలకు పార్టు నెంబర్లుగా 79, 81, 82, 84, 85, 90, 93, 96 గుర్తించారు.

వ్యవసాయ క్షేత్రంలో మంత్రి తుమ్మల



పంటలను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

దమ్మపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఉదయం గండుగులపల్లి, అప్పారావుపేటలోని వ్యవసాయక్షేత్రాలను సందర్శించారు. అక్కడ సాగు చేసిన మిర్చి పంటను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మంత్రిని కలిసిన వారిలో దమ్మపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వాసం రాణి, దొడ్డా ప్రసాదు, కొయ్యల అచ్యుతరావు, మన్నెం అప్పారావు, కేవి సత్యనారాయణ, కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు, పైడి వెంకటేశ్వరరావు, చెన్నకేశవరావు, బోయినపల్లి సుధాకర్, వాసం శ్రీను, వేణు, బొల్లికొండ నాగేశ్వరరావు, ప్రభాకర్, చల్లగుళ్ళ నర్సింహారావు, చలసాని సాంబశివరావు తదితరులు ఉన్నారు.

డంపింగ్ యార్డ్ రేకుల అపహరణ

- ఏడాదిగా నిర్వహణలో లేని డంపింగ్ యార్డ్
- రూ.6 లక్షలతో నిర్మాణం
- పట్టించుకోని అధికారులు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌లో దొంగలు పడ్డారు. లక్షల రూపాయల ఖర్చుతో ప్రభు త్వం ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌పై నిర్మించిన ఇనుప రేకులను అపహరించిన సంఘటన ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని తెల్దారుపల్లిలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని, పెద్దతండా గ్రామ పంచయాతీకి సంబంధించి డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని తెల్దారుపల్లి రెవెన్యూలో సుమారు 10 కుంటల ప్రభుత్వ భూమిలో 2022 సంవత్సరంలో నిర్మించడం జరిగింది.

ఈ డంపింగ్ యార్డ్ నిర్మాణానికి గ్రామీణ ఉపాధి హమీ పథకం నిధుల నుంచి రూ. 3 లక్షలు, పెద్దతండా గ్రామ పంచాయతీనిధుల నుంచి రూ.3 లక్షలు, మొత్తం 6 లక్షల నిధులతో పెద్ద డంపింగ్ యార్డ్ నిర్మాణం చేపట్టడం జరిగింది. నిర్మాణం చేపట్టిన ఏడాది పాటు పెద్దతండా నుంచి 4 ట్రాక్టర్లు, 6 ఆటోల్లో పొడి, తడి చెత్తను అక్కడి డంపింగ్ యార్డ్‌కు తరలించేవారు. అయితే సుమారు 8 నెలలుగా ఈ డంపింగ్ యార్డ్‌కు చెత్త తరలించకుండా మున్నేరు ప్రాంతంలోకి తరలిస్తున్నారు. దీంతో డంపింగ్ యార్డ్ నిర్వాహణను అధికారులు పట్టించుకోవడం మరిచిపోయారు. కనీసం ఇక్కడ ప్రభుత్వ నిధులతో డంపింగ్ యార్డ్ నిర్మాణం చేసిన విషయం కూడా అధికారులు మరిచిపోయారు.



డంపింగ్ యార్డ్‌పై ఉన్న రేకులు(ఫైల్)

విద్యుత్ మోటార్లు....

ప్రభుత్వ నిధులు రూ.6 లక్షతో పెద్దతండా పంచాయతీ కోసం నిర్మించన డంపింగ్ యార్డ్‌పై ఉన్న విలువైన రేకులను గుర్తు తెలియని దొంగలు అపహరించుకుపోయారు. కాగా ఈ డంపింగ్ యార్డ్ గ్రామ శివారు ప్రాంతంలో ఉండటంతో దొంగలకు అనువుగా మారింది. దీంతో దొంగలు రెండు రోజుల క్రితం రేకులను పీకి ఓ ఆటోలో లోడు చేసుకుని కోదాడ వైపునకు తీసుకువెళ్లి విక్రయించినట్లు తెలుస్తుంది. అపహరణకు గురైన రేకుల విలువ సుమారు రూ. 3 లక్షల ఉంటుందని తెలుస్తుంది. అయతే డంపింగ్ యార్డ్‌పై విలువైన రేకులు అపహరణకు గురైన విషయం కూడా అధికారులకు తెలియకపోవడం శోచనీయంగా మారింది. అయితే అదే రాత్రి డంపంగ్ యార్డ్ చుట్టు పక్కల ప్రాంతాల్లోని రైతుల పోలాల్లోని 4 విద్యుత్ మోటార్లను సైతం అపహరించుకు పోయినట్లు తెలుస్తోంది. విద్యుత్ మోటార్లు, రేకులను ఒకే ఆటోలో తీసుకువెళ్లినట్లు విశ్వసనీయ స మాచారం. ఈ విషయంపై ఏదులాపురం మునిసిపాలిటి కమిషనర్ అహ్మద్ షఫీఉల్లాను వివరణ కోరగా డంపింగ్ యార్డ్‌పై రేకులు అపహరణకు గురైన విషయం తమ దృష్టికి రాలేదని వెంటనే పరిశీలిస్తామన్నారు. పోలీస్ కేసుపెట్టి రికవరీ చేపిస్తామన్నారు.



డంపింగ్ యార్డ్‌పై రేకులు అపహరించుకుపోయిన దృశ్యం

గంజాయి పట్టివేత

భద్రాచలం ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం పట్టణంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదైంది. ఈ మేరకు పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గోదావరి బ్రిడ్జివద్ద వాహన తనీఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్రవాహనంపై ఇరువురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతుండగా, గమనించి వారిని పట్టుకొని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో వారిని తనిఖీ చేయగా నిషేధిత గంజాయి లభ్యమైందని అన్నారు. పట్టుబడిన వ్యక్తులు రఘునాథపాలెంకు చెందిన నెమల అజయ్, వైరా దగ్గరలోని సిరిపురంకు చెందిన కొత్తపల్లి కిరణ్ గా గుర్తించటం జరిగిందన్నారు. పట్టుబడిన గంజాయి ఐదు కేజీలు ఉందని, గంజాయి విలువ రూ.లక్ష 25వేలు ఉంటుందని అంచనావేశారు. కాగా ఇరువురిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

దాడి ఘటనపై కేసు నమోదు

బూర్గంపాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దాడి ఘటనలో సోమవారం బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక గ్రామ పంచాయతీలో గల రిక్షా కాలనీకి చెందిన విషాళ్ అనే యువకుడు గత నెల 25న రాత్రి కూరగాయాల కోసం వెళ్తున్నట్లు తెలిపారు. మార్గమధ్యలో ఐదుగురు ఆకతాయిలు మద్యం మత్తులో యువకుడిపై దాడికి పాల్పడటం గమనించిన స్థానికులు బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న యువకుడి తండ్రి సుబ్బారావుపై సైతం దాడికి పాల్పడ్డారు. దాడిలో యువకుడికి గాయాలు కావడంతో చికిత్స పొంది సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన గణేష్, విక్రమ్, దినేష్, ప్రవీణ్, చిన్నిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి వ్యక్తి నిరసన

ములకలపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామంలో గుర్రాజు ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ ఎక్కి న్యాయం చేయాలని కోరాడు. గుర్రాజు గ్రామంలో ఇంటి నిర్మాణం జరుపుతుండగా కొందరు ఇంటి నిర్మాణం కట్టడానికి వీల్లేదని అంటున్నారని, బాధితుడు మా కుటుంబసభ్యులు 50 సంవత్సరాల క్రితం ఇంటి స్థలం కొన్నామని ఇంటి నిర్మాణానికి అడ్డుపడుతున్నారని, న్యాయం చేయాలని ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపాడు. ఈ విషయం తెలుసుకున్న ఏఎస్ఐ పుల్లారావు బాధితుడికి నచ్చచెప్పి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కిందికి దిగాడు.



నిరసన తెలుపుతున్న వ్యక్తి

ఎనిమిది ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముదిగొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం గంధసరి-పెద్దమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను ముదిగొండ పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంపై దాడులు చేసి పట్టుకున్నారు. పట్టుకున్న ఎనిమిది ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సీఐ మురళీ తెలిపారు.



రూరల్ మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలు

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి) ఖమ్మం రూరల్ మండలంలో మొత్తం 21గ్రామ పంచాయతీలకు సంబంధించి 14 ఎంపీటీసీలను అధికారులు సోమవారం ఖరారు చేశారు. అందుకు సంబంధించిన జాబితాను ఆయా గ్రామ పంచాయతీలలో ప్రదర్శించారు. అయితే గతంలో 31 గ్రామ పంచాయతీలకు ఉండగా, 10 గ్రామ పంచాయతీలు ఏదులాపురం నూతన మున్సిపాలిటీలో కలవడంతో 21 గ్రామపంచాయతీలు మిగిలాయి. వాటికి సంబంధించి 2011 జనాభా లెక్కల ప్రకారం 14 ఎంపీటీసీ స్థానాలు ఖరారు చేశారు. ఈ ఎంపీటీసీ స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ప్రకారం మండల వ్యాప్తంగా మొత్తం 43,259 జనాభా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. పురుషులు 21,771, మహిళలు 21,488 ఉన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	16 రూ.
వంకాయ	38
గుత్తి వంకాయ	40
బీరకాయ	48
పచ్చిమిర్చి	26
బెండకాయ	38
బెండకాయ	44
పొట్లకాయ	40
దోసకాయ	24-44
చిక్కుడు	38
నాటుచిక్కుడు	80
గోరుచిక్కుడు	44
క్యాబేజీ	20
దొండ	32-40
సొరకాయ	18
క్యారెట్	26
క్యాప్సికం	48
ఆలుగడ్డ	28
ఉల్లిగడ్డ	40-45
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	155
కొత్తిమీర కట్ట	20

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	మదగజరాజు
శ్రీనివాస:	దాకూ మహరాజ్
సాయిరాం:	రాచరికం
కేపీఎస్:	రిథమ్ఆఫ్‌లవ్/ ప్రేమిస్తావా
తిరుమల:	సంక్రాంతికి వస్తున్నాం
సినీగెలాక్సీ:	డియర్ కృష్ణా



రామదాసు నేలకొండపల్లిలో జన్మించటం

ఈ ప్రాంత వాసుల అదృష్టం

» గిడ్డంగులసంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు

నేలకొండపల్లి,ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి):భక్త రామదాసు నేలకొండపల్లిలో జన్మించటం ఈ ప్రాంత వాసుల పూర్వజన్మ సుకృతమని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం సాయంత్రం రాయల నాగేశ్వరరావు నేలకొండపల్లిలోని భక్త రామదాసు ధ్యాన మందిరంలో జరుగుతున్న భక్తరామదాసు జయంత్యుత్సవాల్లో పాల్గొన్నారు. ధ్యానమందిరం ఆడిటోరియంలో జరిగిన సభలో రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో వ్యయ, ప్రయాసల కోర్చి, తన ఉద్యోగం పోతుందని తెలిసినా శ్రీరామునిపై ఉన్న అచంచలమైన భక్తి, విశ్వాసాలతో భద్రాచలంలో ఆలయాన్ని భక్త రామదాసు నిర్మించాడన్నారు. నేలకొండపల్లి వాసి కంచర్ల గోపన్న(భక్త రామదాసు) జన్మస్థలమైన నేలకొండ పల్లిలో ఆయన నడయాడిన మందిరంలో ఆయన జయంత్యుత్సవాలను జరుపుకోవటం అభినందనీయమన్నారు. అంతకు ముందు నేలకొండపల్లి మార్కెట్ యార్డులో ఉన్న గోదాములను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌తో కలిసి రాయల తనిఖీ చేశారు. కార్యక్రమంలో భక్తరామదాసు విద్వత్ కళా పీఠం అధ్యక్షుడు సాధు రాధాకృష్ణమూర్తి, సభ్యులు పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, మన్నె కోటేశ్వరరావు, వాసం లక్ష్మయ్య కాంగ్రెస్ నాయకులు బచ్చలకూరి నాగరాజు, యడవల్లి నాగరాజు, బొడ్డు బొందయ్య, రేగూరి వాసవి, దోసపాటి చంద్రశేఖర్, మామిడి వెంకన్న, చెరుకు రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య





ఫిర్యాదుదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ శ్రీజ, వినతిపై ఆర్వోను వివరణ అడుగుతున్న కమిషనర్ అభిషేక్

ఖమ్మంకలెక్టరేట్,ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్, డీఆర్వో ఏ. పద్మజ, డీఆర్డీవో సన్యాసయ్యతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజావాణికి సంబంధించి వచ్చిన ప్రతీ అర్జీనీ పరిశీలన చేసి పెండింగ్‌లో లేకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాఅధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఏ.అరుణ పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

● రఘునాథపాలెం మండలం చింతగట్టు రెవెన్యూ గ్రామానికి చెందిన కే.ద్రౌపది భూమికి రైతు భరోసా డబ్బులు, ఉపాధిహామీ కూలీ డబ్బులు, గ్యాస్ సబ్సిడీ డబ్బులు తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో జమ కాగా, బ్యాంకు అధికారులు ఆ డబ్బులను రుణం క్రింద నిలిపివేశారని, ఆ డబ్బులు ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది.

● రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామానికి చెందిన సీహెచ్ మట్టయ్య తనకు జారీ చేసిన సదరం సర్టిఫికెట్ లో పేరు తప్పుగా నమోదయిందని, దీనివల్ల తనకు పింఛన్ రావడం లేదని, తనకు పింఛన్ మంజూరు చేయాలని కోరాడు.

● ఖమ్మం వీడీవోస్ కాలనీకి చెందిన ప్రసాద్ రెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని సిబ్బంది నిర్లక్ష్యం వల్ల నాలుగో విడతలో రుణమాఫీ కాలేదని, రుణమాఫీ పూర్తి చేయాలని కోరాడు.

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన కమిషనర్ అభిషేక్

ఖమ్మంసంక్షేమ విభాగం: ప్రజావాణిలో దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థలో కమిషనర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, ఇతరవిభాగాల ఫిర్యాదులపై తక్షణం సంబంధిత అధికారులను పిలిపించి నేరుగా సమాధానం ఇప్పించారు. అక్రమ నిర్మాణాలు, రహదారులు అక్రమణ, తాగునీటి సమస్యలు, పారిశుధ్య ఇబ్బందులపై ప్రజలు అధికంగా ఫిర్యాదులు అందించారు. ఈఈ కృష్ణలాల్, ఆర్వో శ్రీనివాసరావు, పట్టణ ప్రణాళిక అధికారి వసుంధర, ఏవో శివలింగం, టీఎంసీ సుజాత పాల్గొన్నారు.

'స్మార్ట్‌కిడ్జ్'లో వసంత పంచమి వేడుకలు

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు విద్యాలయాల్లో సోమవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. సరస్వతీమాత చిత్రపటాలకు ప్రత్యేకంగా అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేదపండితులు విద్యార్థులను ఆశీర్వాదాలు అందించారు. స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, డైరెక్టర్ సుకన్య పాఠశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులచే అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు.



గీతాంజలి విద్యార్థుల ప్రతిభ



ఖమ్మంఖానాపురంహవేలి ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): గతనెలలో సుచరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా నిర్వహించిన ఒలంపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో నగరంలోని గీతాంజలి పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరచారు. బహుమతులు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ టీవి అప్పారావు, డైరెక్టర్లు టి పద్మ, అరుణ్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల16న హైదరాబాద్‌లోని లలితకళాతోరణంలో బహుమతులు అందిస్తారని తెలిపారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు.



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందే

బీసీ సంఘం నాయకుడు గుండాల కృష్ణ



ఖమ్మం చర్చికాంపౌండ్ ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని బీసీ సంఘం నాయకులు గుండాల కృష్ణ అన్నారు. సోమవారం నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో బీసీ కులస్తుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం గతంలో ఇచ్చినమాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్ కల్పించి ఎన్నికలు నిర్వహించాలన్నారు. కులగణ ప్రకారం కులాల నిష్పత్తి ప్రకారం వారికి రిజర్వేషన్ అందించాలన్నారు. అన్ని రంగాల్లో బీసీల పట్ల చిన్న చూపు తగదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూరాకుల నాగభూషణం, రాజేశ్వరరావు, నెహ్రూ, కూరపాటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కుసుమ హరినాథబాబా కల్యాణం

తిరుమలాయపాలెం,ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి):తిరుమలాయపాలెంలో కొలువుదీరిన కుసుమ హరినాథబాబా కల్యాణం వేడుకలు మంగళవారం జరుగుతున్నట్టు ఆలయ అర్చకుడు బొర్రా సుందరాచార్యులు తెలిపారు. సోమవారం నుంచి స్వామివారి ఏకనాం కీర్తనలు, భజనలు నిర్వహించారు. మంగళవారం 11:30గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): మండలంలో వేసవిలో నీటిఎద్దడి లేకుండా చర్యలు చేపడుత్నుట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఖలీక్ తెలిపారు. సోమవారం మండలంలోనిపిండిప్రోలులో మంచినీటి బావులు పరిశీలించారు. చేతిపంపులు పరిశీలించారు. తాగునీటికి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికి సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు.

మా బకాయిలు చెల్లించాలి

నేలకొండపల్లి, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): నవంబరు 23నుంచి డిసెంబరు24వరకు సీప్ సర్వే ఆన్‌లైన్ బకాయి నగదును వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సీప్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. నిరుద్యోగులుగా ఉన్న మేము అధికారులు అప్పచెప్పిన బాధ్యతను పగలు, రాత్రి తేడా లేకుండా పని చేసి పూర్తి చేశామని, పని చేసిన దానికి రావలసిన సొమ్ము రెండునెలలు గడిచినప్పటికీ నేటికీ మాకు అందలేదన్నారు. బకాయిలను వెంటనే ఇప్పించి తమను ఆదుకోవాలని తహసీల్దార్ జాదవ్ మాణిక్యానికి ఇచ్చిన వినతిపత్రంలో కోరారు.

పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి

ఖమ్మంకలెక్టరేట్, జనవరి3(ఆంధ్రజ్యోతి):పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సతుపల్లి, మధిర, వైరా పట్టణాల మున్సిపాలిటీల పని తీరుపై అధికారులతో సమీక్షించారు.మున్సిపాలిటీలలో ఆస్తిపన్నుల వసూలు, చేపట్టిన అభివృద్ధి పనులు, పచ్చదనం, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, టౌన్ ప్లానింగ్ లాంటి పలు విభాగాలపై వివరాలను తెలుసుకొని సూచనలు చేశారు. మున్సిపాలిటీలో ఆస్తిపన్నుల వసూలు సమీక్షించుకొని వందశాతం పన్ను వసూలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో వైరా, సత్తుపల్లి, మధిర మునిసిపల్ కమిషనర్‌లు వేణు, సంపత్ కుమార్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో మంత్రి పొంగులేటి పూజలు

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ గ్రామాల్లో రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం పర్యటించారు. గోళ్లపాడు గ్రామంలో ఇటీవల శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ జరగ్గా, పొంగులేటి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మద్ది మల్లారెడ్డి, వెంకటరెడ్డి, కిషోర్ రెడ్డి, యల్లారెడ్డి పాల్గొన్నారు.






వేసవిలో తాగునీటి ఎద్దడిపై అప్రమత్తంగా ఉండాలి

మిషన్ భగీరథ సీఈ

వైరా,ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): ఈ వేసవి కాలంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి సమస్య రాకుండా ముందస్తుగానే పకడ్బందీగా చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ తమ అధికారులను ఆదేశించారు. సోమవారం వైరా రిజర్వాయర్ గుట్టలపైనున్న మిషన్ భగీరథ పథకాన్ని ఎస్ఈ సదాశివరావుతో కలిసి సందర్శించారు. ఇక్కడ మిషన్ భగీరథ పనితీరు, తాగునీటి సరఫరా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ అమలుతీరును సమీక్షించారు. వైరా రిజర్వాయర్‌లో నీటి లభ్యత గురించి ఆరా తీశారు. ఇప్పటినుంచే వేసవిలో తాగునీటి సమస్య రాకుండా అవసరమైన అన్నిచర్యలు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు. ఈఈ వాణిశ్రీ, డీఈ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



టీడీపీ సీనియర్ నాయకుడి కన్నుమూత

నేలకొండపల్లి,ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త, నేలకొండపల్లికి చెందిన పాలడుగు పూర్ణచందర్‌రావు (76) అనారోగ్యంతో ఆదివారం హైదరాబాద్‌లో మృతి చెందారు. మృతదేహాన్ని నేలకొండపల్లిలోని ఆయన స్వగృహానికి తరలించి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పూర్ణచందర్‌రావు మృతి సమాచారం తెలుసుకున్న తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. జిల్లా నాయకులు ఆరెకట్ల కొండలరావు, తలశీల గోపాలరావు, వివిధ పార్టీల అభిమానులు, నాయకులు నివాళులర్పించారు.



ఓపెన్‌స్కూల్ పరీక్ష ఫీజు గడువు పెంపు

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ పది, ఇంటర్మీడియట్ 2024-25 విద్యాసంవత్సరంలో నిర్వహించే పరీక్షల ఫీజు గడువును పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ పాపారావు తెలిపారు. అపరాధ రుసుంతో ఈనెల 10 వరకు, తత్కాల్ స్కీమ్‌లో అదనంగా పదోతరగతికి రూ.500, ఇంటర్మీడియట్‌కు రూ.1000 అపరాద రుసుంతో ఈనెల 13 వరకు చెల్లించవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్‌ను సంప్రదించాలని డీఈవో తెలిపారు.



గీతామాధురి సందడి

ఖమ్మంసాంస్కృతికం, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీగాయని గీతామాధురి సోమవారం ఖమ్మంలో సందడి చేశారు. వైరా రోడ్‌లో నూతనంగా ఫ్యాషన్ డిజైన్‌కు సంబంధించి ఏర్పాటు చేసిన డిజైనర్ స్టుడియో అవుట్ లెట్‌ను జిల్లా కాంగ్రెస్‌నేత తుమ్మల యుగంధర్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఆమె స్థానిక మీడియాతో ముచ్చటించారు.గీతా మాధురిని చూసేందుకు సంగీతాభిమానులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.





విరాళం అందజేత

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకాపూరి కాలనీలో నూతనంగా నిర్మితమవుతున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయానికి దాతలు సోమవారం విరాళం అందజేశారు. స్థానిక సురేష్ టెంట్‌హౌస్ నిర్వహకులు అనుమోలు సురేష్, కళావతి దంపతులు ఆలయంలోని స్వామివారి పాదాల కింద రాతిపీఠం నిమిత్తం రూ.25,116లు విరాళంగా అందించారు. అదేవిధంగా కన్నయ్య, కార్తీక్, వీణ, జ్ఞానశ్రీ భార్గవ్, శహంత్‌లు రూ.11,116 లు, నూజివీడుకు చెందిన బంధ వీరరాజు శర్మ, రాజేశ్వరి, కృష్ణప్రసాద్, దీప్తి, ప్రీతమ్, అభిరామ్‌లు రూ.10,116లు అందించగా దాతలను స్వామివారి శేషవస్త్రంతో సన్మానించారు. వివరాలకు 94407 70314సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

రైల్వే గేటు మూసివేత

కారేపల్లి, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చీమలపాడు, టేకులపల్లి మండలం తడికలపుడి రైల్వే మార్గంలోని రైల్వేగేటును 12రోజుల పాటు మూసివేస్తున్నట్లు సంబంధిత రైల్వే అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గేటులో మరమ్మతుల కారణంగా మంగళవారం నుంచి ఈనెల 15వరకు మూసివేస్తున్నట్లు తెలిపారు. ఈప్రాంతంలో ప్రయాణించే వాహనదారులు గమనించాలని కోరారు. మరమ్మతుల అనంతరం గేటు తెరుస్తామన్నారు.

పథకాలు అమలు చేయాలి

కారేపల్లి, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికి అమలు చేయాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. సోమవారం బాణోత్ బన్సిలాల్ అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయి ననాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె.నరేందర్, వజ్జారామారావు, పండగ కొండయ్య, సూరబాక ధనమ్మ, సైదులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ముదిగొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం వల్లభి గ్రామానికి చెందిన పి.రాంబాబు కరోనా సమయంలో మృతిచెందగా ఆయనకు భార్య, నలుగురు కుమార్తెలున్నారు. వారి కుటుంబ అవసరాల నిమిత్తం ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడాది కూడా వల్లభి భక్తరామదాసు స్వచ్ఛంద సేవసంస్థ ఆధ్వర్యంలో రూ.పదివేల ఆర్థికసహాయాన్ని సోమవారం సంస్థ చైర్మన్ పోట్ల వెంకటప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోట్ల కృష్ణకుమారి, ధనమూర్తి, విజయభాస్కర్, ఏడుకొండలు, రవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిరసన

తల్లాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సోమవారం తల్లాడలో అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, నాయకులు రాయల రాము, రమేష్, రవి, నాగన్న, బసవయ్య, కిరణ్ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ చెక్కు పంపిణీ

మధిర రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఆత్కూరు గ్రామంలో షేక్.చిన్న నాగేంద్రమ్మ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ చికిత్స చేయించుకునే ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతుంది. దీంతో స్థానిక నాయకులు ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన భట్టి విక్రమార్క బాధితురాలికి రూ.1.20లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. ఈ మంజూరు పత్రాన్ని సోమవారం ఆత్కూరు గ్రామంలో కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు దారా బాలరాజు చేతులమీదుగా బాధితురాలికి అందించారు.

పోక్సో కేసు నమోదు

కారేపల్లి, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రేలకాయలపల్లి బాలుర ఆశ్రమపాఠశాల డిప్యూటీ వార్డెన్ భూక్యా వెంకటేశ్వర్లపై సోమవారం రాత్రి పోక్సో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాల డిప్యూటీ వార్డెన్ బి.వెంకటేశ్వర్లు, ఇటీవల అశ్రమపాఠశాలలో ఉంటూ బాలురపై వేధింపులకు పాల్పడుతున్నాడని బాధిత విద్యార్థుల ఫిర్యాదుపై ఏటీడబ్ల్యూవో జహిరుద్దీన్ విచారణ చేసి డిప్యూటీ వార్డెన్ వెంకటేశ్వర్లను సస్పెండ్ చేశారు. దీంతో ఆయన పాఠశాలలోనే ఆత్మహత్యయుత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం ఖమ్మం ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నాడు. వెంకటేశ్వరరావు తనను వేధించాడని ఓవిద్యార్థి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో డిప్యూటీ వార్డెన్‌పై పోక్సో కేసు నమోదు చేశారు.

మధిరలో గ్రీవెన్స్

మధిరటౌన్, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): మధిర తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రివెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు తమ సమస్యలను తెలుపుతూ తహసీల్దార్‌కు దరఖాస్తులు అందచేశారు. ధరణి సర్వర్ 15రోజులు గా మోరాయించడంతో నిలిచి పోయిన వ్యవసాయ భూమికి చెందిన రిజిస్ట్రేషన్లు ఈ రోజు సర్వర్ సరిగా పనిచేస్తుండటంతో రిజిస్ట్రేషన్లు చేయించుకునేవారు తహసీల్దార్ కార్యాలయానికి అధికంగా వచ్చారు.

‘సత్తుపల్లి’లో రగులుతున్న రాజకీయం

» పంచాయతీ ఎన్నికల వేళ బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య రగడ
» ఇరుపార్టీల కేడర్‌లో సమరోత్సాహం



సత్తుపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సతుపల్లి నియోజకవర్గంలో రాజకీయాలు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. గత కొద్ది రోజులుగా సత్తుపల్లిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య రాజకీయ కార్యక్రమాలు ఊపందుకున్నాయి. పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెల 15న వెలువడే అవకాశం ఉందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించడంతో పార్టీల కేడర్‌లో ఉత్సాహం మరింత రెట్టింపు అయ్యింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సత్తుపల్లిలో ఓటమి పాలై, రాష్ట్రంలో ఆ పార్టీ అధికారం కోల్పోయిన విషయం విధితమే. దీంతో బీఆర్ఎస్ కేడర్ తీవ్ర నిరాశ, నిస్పృహలో ఉన్నారు. మరో పక్క కాంగ్రెస్ అధికారంలోకి రావడం సత్తుపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలుపొందడంతో కాంగ్రెస్ కేడర్ ఉత్సాహంగా ఉంది.

నియోజకవర్గంలో ఏడాది కాలంగా రాజకీయ కార్యక్రమాలు పెద్దగా లేవు. బీఆర్ఎస్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సత్తుపల్లి నియోజకవర్గంలో పర్యటిస్తూ కార్యకర్తలను కలుసుకుంటున్నారు. పార్టీ పరంగా అడపాదడపా కార్యక్రమాలు జరుగుతున్నాయి తప్ప పూర్తి స్థాయిలో ప్రజాక్షేత్రంలో ఆ పార్టీ కేడర్ లేని పరిస్థితి. కాంగ్రెస్ విషయానికొస్తే సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ప్రజల్లో తిరుగుతూ అధికారిక కార్యక్రమాలతో పాటు కార్యకర్తలను కలుస్తున్నారు. అధికార పార్టీ కార్యకర్తలు మంచి జోష్‌లో ఉన్నారు. దీంతో కొద్ది నెలలుగా రాజకీయ కార్యకలాపాలు స్థబ్దుగా ఉన్నాయి.

ఒక్కసారిగా కేడర్‌లో కదలిక

గత అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి అధికార కాంగ్రెస్ కేడర్ ఉత్సాహంగా పని చేస్తోంది. మరో పక్క కొద్ది రోజుల వరకూ స్తబ్దుగా ఉన్న బీఆర్ఎస్‌లో కూడా ఒక్కసారిగా కదలిక వచ్చింది. గత నెల 31న సత్తుపల్లి మునిసిపల్ తాజా మాజీ పాలకవర్గ బీఆర్ఎస్ సభ్యులకు జరిగిన అభినందన సభలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య రాష్ట్ర ప్రభుత్వంపైనా, స్థానిక అధికార పార్టీ నాయకులపై చేసిన ఆరోపణలకు కాంగ్రెస్ నాయకులు కూడా గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. ఇది ఇరు పార్టీల మధ్య రాజకీయ రగడగా మారింది. సండ్ర చేసిన ఆరోపణలు నిరూపించాలని, అంబేద్కర్ విగ్రహం వద్దకు తాము వస్తామని బీఆర్ఎస్ నాయకులు కూడా రావాలని కాంగ్రెస్ నాయకులు సవాలు చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆదివారం పోలీసులు బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేసి వేంసూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ నాయకులను కూడా అరెస్టు చేసి సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో ఇరు పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు తారాస్థాయికి చేరాయి. సామాజిక మాధ్యమాల్లో కూడా సవాళ్ల ప్రతి సవాళ్ల హోరెత్తాయి.

ఐక్యత పెంచిన అరెస్టులు....

ఆదివారం పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడంతో ఇరు పార్టీల కేడర్‌లో ఐక్యత పెరిగింది. బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేశారని సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన కొద్ది సేపట్లోనే నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ కేడర్ ఒక్కసారిగా అలెర్ట్ అయింది. అరెస్టయిన నాయకులను వేంసూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించగా పలు మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు వేంసూరు చేరుకున్నారు. వేంసూరు మండల వ్యాప్తంగా ఉన్న నాయకులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని అరెస్టయిన వారికి సంఘీబావం తెలిపారు. గత కొద్ది నెలలుగా ఎవరికి వారే అన్నట్లుగా ఉన్న బీఆర్ఎస్ కేడర్‌లో ముందస్తు అరెస్టులతో ఐక్యత పెరిగినట్లు అయ్యింది. కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేయడంతో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అరెస్టయిన వారికి మద్దతు ప్రకటించారు. ఈ రెండు పార్టీల మధ్య రాజకీయ రగడ రచ్చకెక్కడం కేడర్‌లో ప్రతిష్ఠ పెరిగింది. ముందస్తు అరెస్టులు బీఆర్ఎస్‌లో ఐక్యతను పెంచిందనే విషయాన్ని పలువురు విశ్లేషిస్తున్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలి: ఎమ్మెల్యే



101దైవాలను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాల ని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. పట్టణంలోని జూపల్లి కంటి ఆసుపత్రి రోడ్‌లో చీపు చిన్నయ్య ప్రాంగణంలో 101దైవాలతో సేవ, పూజా కార్యక్రమాలు, ఊరేగింపు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండలంలో పలు గ్రామాలలో పర్యటించిన ఆమె పలువురిని పరామర్శించారు.

పరిశుభ్రతపై సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సతుపల్లి, మధిర, వైరా పట్టణాల మునిసిపాలిటీల పని తీరుపై అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో వైరా, సత్తుపల్లి, మధిర మునిసిపల్ కమిషనర్‌లు వేణు, సంపత్ కుమార్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

వరిపైరు పరిశీలన

తల్లాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారుగూడెం, గోపాలపేట గ్రామాల్లో రబీ వరిపైర్లను సోమవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ మాట్లాడుతూపురుగు ఆశించినప్పుడు ఆకులు నిలువుగా ముడుచుగా లోపల ఉంటూ పత్రహరితాన్ని పురుగు గోకి తింటుందని తెలిపారు. తొలి దశలో ఎస్పేట్ 75ఎస్పీ 1.5గ్రాములు లేదా కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 50ఎస్పీ 2గ్రాము లు లేదా క్లోరాంట్రానిలిపోల్ 18.5ఎస్‌సీ 0.3 మిల్లీలీటర్లు లేదా ఫ్లూబెండామైడ్ 20 డబ్ల్యూజీ 0.25గ్రాములు లేదా ఫ్లూబెండ మైడ్ 480 ఎస్‌సీ 0.1 మిల్లీలీ టర్లు లీటరు నీటి కి కలిపి మందు లను మారుస్తూ పిచికారి చేసుకో వాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వాసిరెడ్డి చైతన్య, విస్తరణ శాస్త్రవేత్త పీఎస్ఎం.పణిశ్రీ, ఏవో ఎండీ.తాజుద్దీన్, ఏఈవో హసీనా, ఆపతి దుగ్గినేని సత్య నారాయణ, కృష్ణయ్య, వెంకట రామారావు పాల్గొన్నారు

తాగునీటి ఎద్దడిపై

అప్రమత్తంగా ఉండాలి

» మిషన్ భగీరథ సీఈ శ్రీనివాస్

వైరా, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈ వేసవికాలంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి సమస్య రాకుండా ముందస్తుగానే పకడ్బందీగా చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ తమ అధికారులను ఆదేశించారు. సోమవారం వైరా రిజర్వాయర్ గుట్టలపైనున్న మిషన్ భగీరథ పథకాన్ని ఎస్ఈ సదాశివరావుతో కలిసి సందర్శించారు. ఇక్కడ మిషన్ భగీరథ పనితీరు, తాగునీటి సరఫరా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈఈ వాణిశ్రీ, డీఈ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై సమావేశం

ముదిగొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల దినోత్సవంలో భాగంగా మండలంలోని పిల్లలకు డీవార్మింగ్ మాత్రలను అందించడం జరుగుతుందని మండల వైద్యాధికారి అరుణాదేవి తెలిపారు. సోమవారం నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పిల్లలందరికీ డీవార్మింగ్ మాత్రలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీతా ఎల్జిబెత్, ఎంఈవో రమణయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు విధిగా పంటల నమోదు చేసుకోవాలి



పంటల నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య,

వైరా, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తాము సాగుచేసిన పంటలను విధిగా నమోదు చేసుకోవడం ద్వారా రైతులకు ఎంతో మేలు కలుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి దనసరి పుల్లయ్య సూచించారు. మండలంలో సోమవరం గ్రామంలో సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి డిజిటల్ క్రాప్ బుకింగ్ విధానాన్ని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పంటల నమోదు విధానాన్ని అమలుచేయాలని సిబ్బందికి సూచించారు. పంటలు విక్రయించుకునే సమయంలో రైతులకు ఏవిధంగా ఇబ్బంది లేకుండా ఈ పంటల నమోదు ఎంతో దోహదపడుతుందన్నారు. వరిపంటలో నేరుగా వెదజల్లే పద్ధతిని పరిశీలించారు. వైరా డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకురాలు తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏవో మయాన్ మంజూఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సిద్ధం

కల్లూరు, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ల తుది జాబితా (సవరణ)ను సోమవారం మండల పరిషత్ అధికారులు ప్రకటించారు. త్వరలో జరగనున్న గ్రామ పంచాయితీ ఎన్నిలకు గాను ఓటర్ల జాబితాను మండల పరిషత్ అధికారి చంద్రశేఖర్, సూపరింటెండెంట్ సత్యనారాయణశర్మల సమక్షంలో వాటిని ప్రకటించారు. అదే విధంగా వార్డుల విభజన కూడా పూర్తి అయిందని వివరించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు.

చిరస్మరణీయమైన విజయాన్ని అందించారు

» అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని

మధిరటౌన్, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): అండర్ 19 క్రికెట్ ప్రపంచ కప్ పోటీ ఫైనల్‌లో భారత జట్టు చిరస్మరణీయమైన విజయం సాధించి దేశం గర్వించేలా యువ క్రీడాకారిణులు చేశారని అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని అన్నారు. సోమవారం మధిరలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో క్రికెట్‌లో భారత్ విజయం సాధించడంతో కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఖమ్మం జిల్లాకు చెందిన క్రీడాకారిణి త్రిష అద్భుత ప్రతిభ కనబరిచి కప్ సాధించడంలో కీలక పాత్ర పోషించడం జిల్లాకే గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి నాయకులు అద్దంకి రవికుమార్, వనజ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాయల విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన

తల్లాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ స్వర్గీయ రాయల వెంకటశేషగిరిరావు విగ్రహ నిర్మాణానికి సోమవారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాయల వెంకటశేషగిరిరావు సేవలను ఆయన కొనియాడారు. అనంతరం బిల్లుపాడు గ్రామంలో ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న మాజీ ఎంపీటీసీ రుద్రాక్ష బ్రహ్మంను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్‌లాల్, నాయకులు దిరిశాల దాసూరావు, కేతినేని చలపతిరావు, నాయుడు శ్రీనివాసరావు, వజ్రాల రామిరెడ్డి, బద్దం కోటిరెడ్డి, ముప్వా మురళీధర్‌రావు, కొండపల్లి చంద్రశేఖర్, వనిగండ్ల అశోక్, వరపర్ల ఉదయ్ పాల్గొన్నారు.

‘ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేయాలి’

ఏన్కూరు, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతిప్రతినిధి): హైదరాబాద్‌లో ఈనెల 7న తలపెట్టిన లక్షడప్పులు...వేల గొంతుకల మాదిగల ప్రదర్శన పోస్టర్లను సోమవారం అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యంగల నరేష్ మాట్లాడారు. ఈకార్యక్రమంలో పూర్ణకంటి మైసారావుమాదిగ, పూర్ణకంటి నాగరాజు మాదిగ, చింతనబోయిన సీతారాములు, అంజనకుమార్‌యాదవ్, జూపాటి శ్రీనివాస్, సాయిమాదిగ, ప్రవీణ్‌మాదిగ, రాకేష్‌మాదిగ తదితరులున్నారు

నేటినుంచి రామాలయ ప్రతిష్ఠా మహోత్సవాలు



రామాలయం

సత్తుపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యగారిపేటలో నూతనంగా నిర్మితమైన రామాలయ ప్రతిష్ఠా మహోత్సవాలు నేటినుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 7వ తేదీన ప్రతిష్ఠా మహోత్సవంతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి వారి మంగళా శాసనాలతో 4రోజులు పూజా కార్యక్రమాలు సాగనున్నాయి.

ఆలయాల్లో వసంత పంచమి వేడుకలు



సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్/బోనకల్/మధిరటౌన్, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): వసంత పంచమి వేడుకలను మధిరలో అన్ని దేవాలయాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పలు దేవాలయాలలో చిన్నారులకు అక్షరాభాస్యం నిర్వహించారు. పుస్తక పూజలు, బీజాక్షర క్రతువులను చేయించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు.

‘ఉగాదికి పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన’

వేంసూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఉగాదికి వేంసూరు మండలం కల్లూరుగూడెంలో పామాయిల్ ఫ్యాక్టరీకి ముఖ్యమంతి రేవంత్‌రెడ్డిచే శంకుస్థాపన చేయించడం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారని మాజీ ఎంపీపీ రాచూరి గంగరాజు తెలిపారు. గతంలో పామాయిల్ ఫ్యాక్టరీకి వెళ్లే రహదారికి భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరించలేదు. మంత్రి తుమ్మల సూచనల మేరకు సోమవారం కల్లూరు ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రాజేంద్రగౌడ్, పామాయిల్ ఫ్యాక్టరీ జీఎం సుధాకర్‌రెడ్డిలు కల్లూరుగూడెం గ్రామానికి చెందిన పలువురు రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పామాయిల్ ఫ్యాక్టరీకి వెళ్లే రహదారి నిర్మాణానికి అవసరమైన భూములు ఇస్తామని రైతులు అంగీకరించడంతో సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది.

పాఠశాల ఫౌండేషన్ నిర్వాహకుడి మృతి



సాంబశివరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తాతా మధు, సండ్ర

తల్లాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం వెంగన్నపేట గ్రామానికి చెందిన పాఠశాల ఫౌండేషన్ నిర్వాహకుడు కల్యాణపు సాంబశివరావు(52) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. సాంబశివరావుకు భార్య ఉన్నారు. సాంబశివరావు పాఠశాల ఫౌండేషన్ ద్వారా ఎన్నారైల సహకారంతో జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గ్రంథాలయాలకు విలువైన పుస్తకాలను బహూకరించేందుకు విశేష కృషిచేశారు. అన్నారుగూడెం గ్రామంలో విద్యుత్ ప్రమాదంలో రెండు చేతులు కోల్పోయిన కొమ్మినేని రామారావు కుటుంబానికి రూ.4లక్షల ఆర్థికసహాయం అందించి ఆదుకున్నారు. సాంబశివరావు భౌతికకాయాన్ని ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, కార్పొరేటర్లు కూరాకుల వలరాజు, చిరుమామిళ్ల నాగేశ్వరరావు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంబశివరావు మృతికి మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్‌లాల్ తదితరులు సంతాపం తెలిపారు.